జన రాజకీయం కోసం...
₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 21
నవంబరు 1-15, 2018

## ఎన్ని కోట్ల మందిని జైళ్లల్లో పెట్టగలరు?




# గాంధీజీ అర్థమైతే... యువత ఆయన్ని వదలరు : జేపీ

## భావ ప్రకటనకు బంధనాలు

## సీబీఐ కుదుపు కావాలి ఓ మలుపు

## ఎన్నికల ఎజెండాకు కొత్త చూపునివ్వాలి





# అనిశ్చిత పరిస్థితుల్ని అవకాశాలుగా మలచుకోవటం

గీతం హైదరాబాద్ బిజినెస్ స్కూల్ డ్యూయల్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లనుద్దేశించి మాస్టర్ క్లాస్ స్పీకర్ సెషన్‌లో మాట్లాడుతున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, 4వ పారిశ్రామిక విప్లవం, ఈ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వం, సంస్థలు, వ్యక్తుల పాత్ర తదితర అంశాలను తన ప్రసంగం, చర్చాగోష్ఠిలో వివరించారు. నిరంతర స్వీయ అధ్యయనం, మార్పుని ఆహ్వానించగలగటం, ఆర్తితో, సృజనాత్మకతతో పరిష్కారాల్లో భాగమవటం, సానుకూల దృక్పథం, బృంద సభ్యుల్లో స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని నింపే నాయకత్వ సామర్థ్యాన్ని పెంచుకోవటం వంటి అంశాలనూ ప్రస్తావించారు. కార్యక్రమంలో పాల్గొన్న యువత నూతన సవాళ్లను స్వీకరించటం పట్ల ఎంతో ఆశావహ, క్రియాశీల దృక్పథంతో స్పందించారు.

# ఆర్‌టీఐ మీట్



సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 13వ వార్షికోత్సవం సందర్భంగా సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన ఆర్‌టీఐ సమావేశం చిత్రమిది! చట్టం అమలులో నేర్చుకున్న పాఠాలు, భవిష్యత్ కార్యాచరణపై ఇందులో చర్చించారు. మొదటి కేంద్ర సమాచార కమిషనర్ (సీఐసీ) వాజాద్ హబీబుల్లా అధ్యక్షత వహించారు. ఆర్‌టీఐ రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించిన లోక్‌సత్తా జేపీతోపాటు... 2005 నుంచి సహ చట్టంతో అనుబంధమున్న కార్యకర్తలు, పరిశోధకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

నవంబర్ 1-15, 2018 సంపుటి - ౨ సంచిక - 21




టికెట్ సంపాదించుకున్నాడయ్యా... కానీ, అతని ప్రత్యర్థి తన కన్నా మూడింతలు ఖర్చు పెట్టగలడని...

## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

భావప్రకటనకు బంధనాలు........................... 5
గాంధీజీ అర్థమైతే.. యువత ఆయన్ని వదలరు..... 8
నగరీకరణ : అభివృద్ధి విధానాల్లో 'స్థానికతకు...... 14
'ఆయుష్మాన్ భారత్'.. ఇప్పటికైతే ఎన్నికల స్కీమే...16
విధానాల వైఫల్యమే భారతదేశ వైఫల్యం!........... 18
కుల,ధన రాజకీయాలు మనకొద్దు !................. 19
ఎన్నికల ఎజెండాకు కొత్త చూపునివ్వాలి.......... 24
పన్నుల తగ్గింపే పరిష్కారం........................... 25
జీవనానికి హాట్‌స్పాట్‌ల దెబ్బ......................... 26
ప్రమాద హెచ్చరిక ఇంకా తీవ్రతరం.................. 28
దేశభక్తి ఉంది కానీ..................................... 30
రామాయపట్నానికి మార్గం సుగమం............... 32
ఈ కుదుపు కావాలి ఓ మలుపు........................33

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ఎన్నికోట్లమందిని జైళ్లల్లో పెట్టగలరు?




ప్రజాస్వామ్య సంస్కరణల్లో భాగంగా న్యాయవ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై దేశవ్యాప్తంగా అనేకమంది న్యాయమూర్తులను కూడా కలుసుకోవడం జరిగింది. ఇలా ఇంతవరకూ దాదాపు 200 మంది హైకోర్టు జడ్జీలతో సమావేశమయ్యుంటా. వారందరినీ ఓ ప్రశ్న అడిగాను. “మీరెవరో చెప్పుకోకుండా, ఇతరులెవరి చేతా ఫోన్ చేయించకుండా, లంచం ఇవ్వకుండా.. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేయించుకోగలరా?”.. ఒక్కరంటే ఒక్క జడ్జీ కూడా ‘గలను’ అని సమాధానం చెప్పలేకపోయారు. పైగా అవన్నీ పౌరులకు హక్కుగా అందించాల్సిన సేవలు! లంచాలు, వేధింపులు లేకుండా జడ్జీలకే పనులు కానప్పుడు.. ఇక ఈ దేశంలో సాధారణ ప్రజలు సర్కారీ ఆఫీసుల్లో పడే అవస్థల్ని చెప్పాలా? పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. ‘అబ్బే, అవినీతి పెద్దగా లేదు. ఉన్నచోట కూడా ప్రజలే అధికారులను ప్రలోభపెట్టి చెడగొడుతున్నారు తప్ప, అధికారులదేమీ తప్పు లేదు’ అన్నట్టు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టానికి సవరణల్ని తీసుకొచ్చింది. దేశంలోని మొత్తం జైళ్లలో సామర్థ్యానికి మించి జనాన్ని కుక్కినా.. ఖైదీల సంఖ్య నాలుగున్నర లక్షలు మించదు. కానీ లంచం ఇచ్చిన పౌరుడికి కనీసంగా 3 ఏళ్లు , గరిష్టంగా 7 ఏళ్లు జైలుశిక్ష అని చట్ట సవరణని ఆమోదించారు. అంటే 130 కోట్ల మంది ప్రజల్లో 0.05 శాతం మంది కూడా లంచాలివ్వాల్సిన అవసరం లేకుండానే సర్కారీ కార్యాలయాల్లో పనులు చేయించుకోగలుగుతున్నారని ప్రభుత్వం భావిస్తోందన్నమాట. మోదీ ప్రభుత్వమే కాదు, పార్లమెంటులోని అన్ని పార్టీలూ కుమ్మక్కయినట్టు ఈ చట్ట సవరణల్ని ఆమోదించాయి. చట్ట సవరణల్లోని అసంబద్ధతపై బిల్లు ముసాయిదా సమయం నుంచే లోక్‌సత్తా హెచ్చరిస్తూ వచ్చింది. “గతిలేక లంచమిచ్చిన పౌరునికి జైలు, తీసుకున్న అధికారి మీద విచారణకు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అనే సవరణలను చేస్తే అది అవినీతిపై పోరాటాన్ని ప్రహసనంగా మారుస్తుంది. మెజారిటీ ప్రజల్ని జైల్లో పెట్టాలనేది చట్టం అనిపించుకోదు, ఆ అర్థరహిత సవరణల్ని వెనక్కి తీసుకోవాలని” లోక్‌సత్తా అన్ని పార్టీలకు, ఎంపీలకు, సంబంధిత మంత్రులకు, ప్రధానికి లేఖలు రాసింది. సమగ్ర సమాచారాన్ని అందించింది. పార్లమెంటరీ స్థాయీ సంఘం ముందు వాదించింది. అయినా కూడా ఆ పనికిమాలిన సవరణల్ని సభలో ఎటువంటి గొడవా లేకుండా ప్రశాంతంగా ఆమోదించారు. పార్లమెంటు జులైలో సవరణల్ని ఆమోదించగా, అక్టోబర్‌లో ఓ సర్వే వచ్చింది. ఆ సర్వే కూడా లోక్‌సత్తా వాదనలే సరైనవని ధృవీకరించింది. ‘గతి లేకపోతే పడుండండి లేదా ఓటును తాకట్టు పెట్టుకుని రాజకీయ నాయకుల దళారీల వద్ద అడుక్కోండి, అంతేతప్ప మాకు చెప్పకుండా లంచమిస్తే జైల్లో వేస్తాం..’ అనే ధోరణిలో పార్లమెంటులో చట్టం చేశాక కూడా 23 శాతం మంది తమ పనులు చక్కపెట్టుకునేందుకు లంచాలిచ్చారని అందులో వెల్లడైంది. ‘లోకల్ సర్కిల్’ అనే కమ్యూనిటీ మీడియా సోషల్ ప్లాట్‌ఫాం, ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ‘ఇండియా కరప్షన్ సర్వే 2018’ పేరుతో దీన్ని నిర్వహించింది. 220 జిల్లాల్లో, ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లోనే, ఆన్‌లైన్‌లోనే జరపటం అనే పరిమితులున్నా కూడా.. నాడిని పసిగట్టటం మేర ఈ సర్వేను ఆమోదించవచ్చు. కిందిస్థాయి అవినీతి దేశవ్యాప్తంగా గతేడాదికన్నా పెరిగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేయించుకోవడానికి లంచం ఇచ్చామని 2017లో 45 శాతం చెబితే, తాజా సర్వేలో 56 శాతం మంది చెప్పారు. ‘ఎన్నికలు సమీపిస్తుండటం, నేతలు అధికారులకు టార్గెట్లు పెట్టటం వల్ల ఇది పెరిగి ఉండొచ్చని లేదా నోట్ల రద్దు వల్ల నగదు అందుబాటులోలేక గతేడాది శాతం తక్కువగా ఉండి ఉండొచ్చని’ లోకల్ సర్కిల్స్ ఛైర్మన్, సీఈవో సచిన్ టపారియా చేసిన విశ్లేషణ.. నేతలు - అధికారుల మధ్య పాతుకుపోయిన ప్రమాదకరమైన లాలూచీకి అద్దం పడుతోంది. పార్లమెంటు ఆమోదించిన అవినీతి నిరోధక చట్ట సవరణల వల్ల మంచికన్నా చెడే ఎక్కువ జరుగుతుందన్న భయాన్ని ఇప్పుడు ఆయన కూడా వ్యక్తం చేస్తున్నారు. ఇక రాష్ట్రాలవారీగా 13 రాష్ట్రాల్లో చేసిన సర్వే ఫలితాలు కూడా ఆశాజనకంగా ఏమీ లేవు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే, తెలంగాణలో గతంలోలాగే లంచాలిచ్చినవారి సంఖ్య 43 శాతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి కొంత మెరుగుపడినట్టు కనిపిస్తున్నా, అక్కడ రాజకీయ దళారీ వ్యవస్థ పెద్దఎత్తున పనిచేస్తుండటం వల్ల అవినీతి కొత్తరూపంలో పనిచేస్తోంది. రాజకీయ అవినీతిని పక్కనపెట్టి కేవలం సర్వేలోని శాతాలవారీగా చూసినా కూడా.. గతి లేక లంచమిచ్చినందుకు కొన్ని కోట్లమంది ప్రజల్ని జైలులో పెట్టాల్సుంటుంది. ఎంతమంది పోలీసులు కావాలి, ఎన్ని విచారణలు కావాలి, ఎన్ని జైళ్లు కావాలి, ఎన్ని కోట్లమందిని జైల్లో పెడతారు?! మెడ మీద తలకాయ ఉన్నవాడెవడూ తీసుకోని నిర్ణయాన్ని మన తరపున చట్టాలు చేసి పెడతామని ఢిల్లీ వెళ్లిన పెద్దలు పార్లమెంటులో ఆమోదించారు. చట్టమంటే ఏమిటో తెలియనివాళ్లు లేదా పట్టనివాళ్లు చట్టసభలకు వెళ్తూ ఇష్టమొచ్చినట్టు చట్టాల్ని చేస్తున్నా, మన పన్నుల డబ్బును ఖర్చు చేసే బడ్జెట్‌కు ఇష్టారీతిన ఆమోదముద్ర వేస్తున్నా మనం పట్టించుకోవటం లేదు. మరోవైపు, రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారానికి, మౌలిక న్యాయసంస్కరణలకు, రాజ్యాంగ పరిరక్షణకు పరిమితం కావాల్సిన సుప్రీంకోర్టు ప్రజాహిత వ్యాజ్యాల (పిల్)ల విచారణ పేరుతో ప్రచారం కోసం వెంపర్లాడుతున్నట్టు చట్టాలపై ఇచ్చే తీర్పుల గురించి మాత్రం సంచలనంగా చర్చించుకుంటున్నాం. ఈ అపసవ్య ధోరణి ప్రజాస్వామ్యానికి, దేశ భవిష్యత్తుకు చాలా చేటు చేస్తుంది. అవినీతి పోవాలంటే నిర్దిష్టమైన పద్ధతులున్నాయి, అలాంటి వాటి కోసం ఎన్నికల సమయంలో, ఎన్నికల మధ్యా కూడా పార్టీల్ని, ప్రజాప్రతినిధుల్ని డిమాండ్ చేద్దాం. సాంకేతికతను సమర్థంగా వినియోగించటంతోపాటు.. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ గడువు పెట్టి, ఆ సిటిజన్ ఛార్టర్‌లోగా పని పూర్తి చేయకపోతే దరఖాస్తు చేసుకున్న పౌరులకి రోజుకు రూ.250కి తగ్గకుండా పరిహారం చెల్లించేలా ‘పౌర సేవల’ చట్టాన్ని తెస్తే, చాలామట్టుకు రోజువారీ అవినీతి తగ్గుతుంది. దీంతోపాటు స్థానికంగా, ప్రజలుండే చోటకే నిధుల్ని, అధికారాల్ని ఇచ్చి వారికి భాగస్వామ్యం కల్పిస్తే అవినీతిపరుల ఆటలు సాగవు. పౌర సేవల చట్టం, ‘తలసరి కేటాయింపు’ రూపంలో స్థానిక ప్రభుత్వాలకు సాధికారత.. వెంటనే సాధించుకోగలిగినవి. కొంత సమయం పట్టే లక్ష్యాలుగా.. దర్యాప్తు సంస్థలకు స్వయంప్రతిపత్తి కల్పించి బలోపేతం చేసిన లోకాయుక్త/లోక్‌పాల్ పరిధిలోకి తీసుకురావటం, స్వతంత్ర ప్రాసిక్యూషన్‌తో ప్రత్యేక కోర్టుల్లో వేగంగా విచారణ పూర్తి చేసి అవినీతిపరుల ఆస్తుల్ని జప్తు చేయటం, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి ఇతర సంస్కరణల కోసం కృషి చేద్దాం. ఇలా మనం స్పష్టతతో వ్యవహరించకపోతే ..అవినీతి నిరోధక చట్ట సవరణల విషయంలోలా కోట్లమంది ప్రజలను పార్టీలన్నీ కలిసి వాజమ్మలను చేస్తునే ఉంటాయి. ఆ చట్ట వైఫల్యాన్ని సరిద్దికోవటంతోపాటు అలాంటివి పునరావృతం కాకుండా, చట్టసభకు ఎన్నికైనవారు ప్రభుత్వ కార్యాలయాల్లో, పోస్టింగుల్లో, వనరుల్లో జోక్యం చేసుకుంటూ దోపిడీలో, అధికార క్రీడలో మునిగిపోయి తమ బాధ్యతల్ని కోర్టుల మీదకు నెట్టకుండా మనం, ప్రజలమే చైతన్యవంతంగా వ్యవహరించాలి.



# భావప్రకటనకు బంధనాలు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



ప్రమాదంలో పత్రికా స్వేచ్ఛ

కొద్దిరోజుల క్రితం తమిళ పత్రికా సంపాదకుడు 'నక్కీరన్' గోపాల్‌పైన పోలీసులు భారత శిక్షాస్మృతి (ఐ.పి.సి)లో అరుదుగా వాడే 124 సెక్షన్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చెయ్యటం, కోర్టులో 'హిందు' పత్రిక అధిపతి, మాజీ సంపాదకుడు ఎన్. రామ్ తన భావాలని వ్యక్తం చేయటం, గోపాల్‌ని కోర్టు విడుదల చెయ్యటం జరిగాయి. ఈ ఉదంతం దేశవ్యాప్తంగా పత్రికాస్వేచ్ఛ మీద జరుగుతున్న దాడులకి ప్రతీకగా నిలిచి, వాక్స్వాతంత్రంపైన చర్చకి దారితీసింది. ఐ.పి.సిలోని సెక్షన్ 124 రాష్ట్రపతిపైన లేదా గవర్నర్‌పైన దాడి చేసి, వారి చట్టబద్ధ అధికారాలను అడ్డుకోవటానికి సంబంధించింది. అందుకు ఏడేళ్ల దాకా జైలుశిక్ష పడొచ్చు. ఇంతకీ నక్కీరన్ పత్రిక చేసిన నేరం ఏమిటి? కొన్ని కాలేజీలలో ఆడపిల్లలని మభ్యపెట్టి లైంగిక కార్యకలాపాల కోసం లొంగదీసుకునే ప్రయత్నాలు జరిగాయని, అందులో యూని వర్సిటీలకి ఛాన్సలర్ అయిన గవర్నర్ ప్రమేయం ఉండవచ్చుని ఆ పత్రిక కొన్ని సాక్ష్యాలతో వార్తలని ప్రచురించింది. ఆరోపణలు నిరాధారమయితే, పత్రికలో కావాలని అబద్ధపు సాక్ష్యాలని సృష్టిస్తే, తప్పకుండా పత్రిక మీద దావా వేయొచ్చు లేదా అబద్ధాలని కావాలని ప్రచారం చేశారని క్రిమినల్ కేసు పెట్టొచ్చు. కాని గవర్నరు మీద ఆరోపణలని రాజ్యం మీద దాడిగా భావించటం, లేదా ప్రభుత్వం మీద విమర్శని రాజద్రోహ నేరంగా పరిగణించటం నిస్సందేహంగా పత్రికా స్వేచ్ఛని అరికట్టే ప్రయత్నం చేయటమే. ఈ నేపథ్యంలో, ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్రని గూర్చి, ఈనాటి పరిస్థితులలో ఎదురవుతున్న సవాళ్ళని గూర్చి లోతైన చర్చ అవసరం.

రాజ్యాంగంలో 19 (1) (ఎ) అధికరణంలో ప్రతి పౌరుడికి వాక్స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటనా స్వతంత్రాన్ని పొందుపరిచారు. అంటే ప్రతి పౌరుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడొచ్చుని, రాయవచ్చుని కాదు, ఈ స్వేచ్ఛకి కొన్ని హేతుబద్ధమయిన పరిమితుల్ని కూడా విధించారు. 19 (2) అధికరణంలో, వాక్స్వాతంత్రాన్ని అదుపుచేసే చట్టాలు ఏ మేరకు చేయవచ్చో వివరించారు. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతని కాపాడేందుకు, దేశ భద్రత కోసం, ఇతర దేశాలతో సత్సంబంధాల కోసం, శాంతిభద్రతల్ని, లేదా నైతిక విలువల్ని పరిరక్షించటం కోసం, కోర్టుల గౌరవాన్ని కాపాడటం కోసం, ఇతరుల ప్రతిష్ఠని కాపాడటం కోసం, లేదా నేరాలని ప్రేరేపించటాన్ని ఆపటం కోసం మాత్రమే వాక్స్వాతంత్రానికి, భావ ప్రకటనాస్వేచ్ఛకి చట్టం ద్వారా పరిమితులు విధించవచ్చు. అంతేకాని, అధికారంలో ఉన్నవాళ్ళకి నచ్చలేదనో, వారికి ఇబ్బందిగా ఉందనో, వారి నిర్ణయాలని లేదా చర్యలని విమర్శించా రనో వ్యక్తుల భావప్రకటనాస్వేచ్ఛని అరికట్టే హక్కు ఏ ప్రభుత్వానికి, రాష్ట్రపతి, గవర్నర్లకి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులకి, అధికారులకి - ఎవరికీ లేదు. వ్యక్తికున్న భావప్రకటనాస్వేచ్ఛ, వాక్స్వాతంత్రాల నుంచి పత్రికాస్వేచ్ఛ పుట్టింది. కాబట్టి గవర్నరుగారికి ఇబ్బంది కలిగిందనో, ముఖ్యమంత్రిని ఇరకాటంలో పెట్టారనో, ప్రధానమంత్రి మనసుని నొప్పించారనో పత్రికల మీద, వ్యక్తుల మీద దాడి చేస్తే, వారి మీద కేసులు పెట్టి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే, అది కచ్చితంగా ప్రాథమిక హక్కులకి భంగం కలిగిస్తుంది. విమర్శించే హక్కు లేకపోతే అది ప్రజాస్వామ్యం కాజాలదు్మ రాచరికమో, నియంతృత్వమో అవుతుంది.


విమర్శించే హక్కు లేదా భావప్రకటనాస్వేచ్ఛను గౌరవించటం అంటే ఆ విమర్శనో, భావాన్నో అంగీకరించటమని అర్థం కాదు. ఆ విమర్శ లేదా భావం పొరపాటయితే, వాస్తవాలతో, హేతుబద్ధమయిన వాదనలతో వాటిని తిప్పికొట్టే హక్కు, బాధ్యత ప్రభుత్వాలకి, అధికారంలో ఉన్నవాళ్లకి, లేదా విమర్శలకి గురయినవారికి ఉన్నాయి. అంతేగాని, దాడులకి దిగటం, పోలీసులని ఉపయోగించి అరెస్టు చెయ్యటం, క్రిమినల్

కేసులని నిరాధారంగా బనాయించటం, హింసకి పాల్పడటం, గొంతునొక్కటం అనాగరిక ధోరణులకి, అప్రజాస్వామ్య సంస్కృతికి నిదర్శనాలు. ఈ అప్రజాస్వామ్య ధోరణులు ప్రభుత్వంలో ఉన్నా, సమాజంలో ఉన్నా వాటిని నిర్ద్వంద్వంగా ఖండించాలి, ఎదిరించాలి, లేదా ఈ ధోరణులు మనందరి స్వేచ్ఛని, ప్రాథమిక హక్కులని హరించివేస్తాయి. మనకున్న స్వేచ్ఛ ఎవరో రాజులో, పాలకులో, ప్రభుత్వాలో, డబ్బున్నవాళ్లో, కండబలం ఉన్నవాళ్లో, పత్రికాధిపతులో దయతలిచి మనకి దానంగా ఇచ్చినవి కావ్ఫు స్వేచ్ఛ రాజ్యాంగబద్ధంగా మనకు మనం ఇచ్చుకున్నద్ఫి మనకి సహజసిద్ధంగా లభించింది. ప్రభుత్వాలు దేవుళ్ళూ కాద్ఫు రాజులూ కాద్ఫు ప్రభుత్వంలో ఉన్నవాళ్ళని మనం స్వచ్ఛందంగా, మన ఇష్టానుసారం నియమించుకున్నాం. ప్రభుత్వం మనకి జవాబుదారిగా, మనం ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగానికి లోబడి, రాజ్యాంగబద్ధంగా చేసుకున్న చట్టాల పరిధిలో, మన ఉమ్మడి సేవల కోసం, ప్రయోజనాల కోసం పనిచేయాలి. పౌరులు ప్రభుత్వాలకి సేవకులు కాద్ఫు పౌరులు సార్వభౌముల్ఫు ప్రభుత్వాలు ప్రజల సేవ కోసం ఉన్నాయ్ఫి ప్రజలను బానిసలుగా చూడటం కోసం కాదు.

గత కొద్ది సంవత్సరాలుగా ప్రభుత్వాలలోనే కాదు, సమాజంలో కూడా అసహనం పెరుగుతోంది. భావాలని భావాలతో, వాదనలతో ఎదుర్కోకుండా పైశాచిక దాడులు చేయటం, తిట్లుశాపనార్థాలతో నోరు మూయించే ప్రయత్నం చెయ్యటం పెరిగిపోతోంది. అన్ని రకాల భావజాలాల్లోను ఈ అసహన ధోరణి కనిపిస్తోంది. తాము నమ్మిన సమాజ నిర్మాణం కోసం శాంతియుతంగా ప్రయత్నం చేస్తున్న నరేంద్ర దాభోల్కర్ (పూణె, 2013), గోవింద్ పన్సారె (కొల్హాపూర్, 2015), ఎమ్.ఎమ్ కాల్బుర్గి (ధార్వార్, 2015)లని దారుణంగా హత్య చేయటం కావచ్చు, పాత్రికేయురాలు, సామాజిక కార్యకర్త గౌరి లంకేష్ (బెంగళూరు, 2017) హత్య కావచ్చు, నచ్చని పత్రికల మీద పార్టీల్లో, ప్రభుత్వాలో దాడులని ప్రోత్సహించటం కావచ్చు, మావోయిస్టులు, ఇతర అతివాదులు తమని విమర్శించేవారి ప్రాణాలు తీయటం కావచ్చు, తమకిష్టం లేకుండా వేరే కులంవాళ్లని పెళ్లి చేసుకున్నారన్న కసితో కన్నబిడ్డలనే హత్య చేసే దారుణ ఉదంతాలు కావచ్చు, పార్టీల నాయకులు చట్టసభలలోను, టి.వి ఛానళ్ళలోను, పత్రికా

## భిన్నభావజాలంపై వేటు

గడచిన కొన్నేళ్లుగా ప్రభుత్వాలలోనే కాదు సమాజంలోనూ అసహనం పెరుగుతోంది. భావాలను భావాలతో, వాదనలతో ఎదుర్కోవాలి. కానీ- పైశాచిక దాడులు, తిట్లు శాపనార్థాలతో నోరు మూయించే ప్రయత్నాలు పెరిగిపోతున్నాయి. తాము నమ్మిన సమాజ నిర్మాణంకోసం శాంతియుతంగా ప్రయత్నం చేస్తున్న నరేంద్ర దాభోల్కర్ (పుణె, 2013), గోవింద్ పన్సారె (కొల్హాపూర్, 2015), ఎమ్.ఎమ్ కాల్బుర్గి (ధార్వార్, 2015)లను దారుణంగా హత్య కావించారు! పాత్రికేయురాలు, సామాజిక కార్యకర్త గౌరి లంకేష్ (బెంగళూరు, 2017)ను కిరాతకంగా హతమార్చారు. నచ్చని పత్రికలపై రాజకీయ పక్షాలో, ప్రభుత్వాలో దాడులను ప్రోత్సహించడం; మావోయిస్టులు, ఇతర అతివాదులు తమను విమర్శించేవారి ప్రాణాలు తీయటం; తమ అభీష్టానికి విరుద్ధంగా ఇతర కులం వారిని వివాహం చేసుకున్నారన్న కసితో కన్నబిడ్డలనే హత్య చేసే దారుణ ఉదంతాల వంటివి సమాజంలో విస్తరిస్తున్న అసహన ధోరణులకు ప్రతీకలు! వివిధ పార్టీల నాయకులు చట్టసభల్లోనూ, టీవీ ఛానళ్ల చర్చల్లోనూ, పత్రికా ప్రకటనల్లోనూ సభ్యతను మరచిపోయి ప్రత్యర్థులపై అభ్యంతరకర భాష ప్రయోగిస్తున్నారు. తమను విమర్శిస్తున్న వారి వాదనను కనీసం వినే ఓపిక కూడా లేకుండా గట్టిగా అరిచి, గీపెట్టి బలవంతంగా అడ్డుకోవడం సంస్కృతిగా స్థిరపడుతోంది. మేధావులనబడేవారు, పాత్రికేయులు, సంపాదకులు సైతం టీవీ చర్చల్లో అర్థంలేని అరుపులను, కేకలను ప్రోత్సహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్య పదజాలంతో, ఆధారాలు లేని ఆరోపణలకు, తిట్లకు తెగబడే ధోరణి ఇనుమడిస్తోంది. ఇవన్నీ పెరుగుతున్న హింసాత్మక ధోరణులకు, అనాగరిక ప్రవర్తనకు, అణచివేత సంస్కృతికి, సమాజాన్ని ముక్కలు చేసే ధోరణులకు నిదర్శనలు!



ఎమ్.ఎమ్. కాల్బుర్గి



గౌరీ లంకేష్

ప్రకటనలలోను సభ్యతని మరచి దారుణమయిన భాషని ప్రత్యర్థుల మీద వాడటం కావచ్ఫు కనీసం తమ విమర్శకుల మాటలు వినకుండా అరిచి, గీపెట్టి బలవంతంగా అడ్డుకునే ప్రయత్నాలు చెయ్యటం కావచ్ఫు మేధావులనబడేవాళ్లు, పాత్రికేయులు, సంపాదకులు కూడా టి.వి చర్చల్లో అర్థంలేని అరుపులని, కేకలని ప్రోత్సహించటం కావచ్ఫు సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో, ఆధారాలు లేని ఆరోపణలకి, తిట్లకి పాల్పడటం కావచ్చు – ఇవన్నీ పెరుగుతున్న అసహనానికి, హింసాత్మక ధోరణులకి, అనాగరిక ప్రవర్తనకి, అణచివేసే సంస్కృతికి, సమాజాన్ని ముక్కలు చేసే ధోరణులకి నిదర్శనాలు.

"మీరు చెప్పింది నేను ఒప్పుకోన్ఫు కాని అలా చెప్పే మీ హక్కుని నా ప్రాణమొడ్డి కాపాడతాను" – ఈ మాటలు అన్నది వోల్టెయిర్ జీవితచరిత్ర రాసిన ప్రముఖ రచయిత్రి ఎవిలీన్ బియేట్రిస్ హాల్ (1868–1956). ఈ భావం ఆధునిక ప్రజాస్వామ్యానికి, భావప్రకటనా స్వేచ్ఛకి ప్రాణం. ఒకప్పుడు రాజు చెప్పిందే వేదం, ఆ మాటని కాదంటే బందిఖానా, లేదా శిరచ్ఛేదమే. కాని కాలక్రమేణా మానవ సమాజం ప్రతి వ్యక్తికి హుందాతనం, ఆత్మగౌరవం ఉన్నాయని, ప్రతి మనిషికి ఆలోచించే శక్తి, హక్కు ఉన్నాయని, ప్రతి భావానికి విలువ ఇవ్వాలని గుర్తించింది. ఆ భావాల మధ్య వైరుధ్యం ఉండొచ్చు, కాని ఆ భావ సంఘర్షణ నుంచి అందరికీ ఆమోదయోగ్యమయిన పరిష్కారాలు రావాల్ఫి ఉమ్మడి అవసరాలని తీర్చే విధానాలు, చర్చలు కావాలి. అందుకు మంచి ప్రమాణాల బహిరంగ చర్చ, అభిప్రాయ భేదాలున్నా పరస్పర గౌరవమ్ఫు చర్చలో కనీస ప్రమాణాలు, పద్ధతులు, శాంతియుతంగా పరిష్కారం సాధించటానికి మార్గాలు, స్వేచ్ఛకి, బాధ్యతకి మధ్య వారధి కట్టే ఏర్పాట్లు – ఇవన్నీ ప్రజాస్వామ్యం సరిగ్గా నడవటానికి అత్యంత కీలకమయిన ఏర్పాట్లు. ప్రజాస్వామ్యం అంటే ఓటు ద్వారా నిరంకుశమయిన మరో రాజో, నియంతో మన నెత్తి మీద కూర్చుని శాసించటం కాదు. మనం ఎన్నుకున్న ప్రభుత్వం మనకి జవాబుదారిగా ఉండటం, మన స్వేచ్ఛలని గౌరవించి కాపాడటం, మన విమర్శలకి నమ్రతతో సమాధానం ఇవ్వటం, పొరపాటు చేస్తే దాన్ని సరిదిద్దుకోవటం, అధికారం అశాశ్వతమని, ప్రజల సమ్మతితో తాత్కాలికంగా వచ్చిన బాధ్యతే తప్ప ప్రజాస్వామ్యంలో పదవులు ఎవరి హక్కూ కాదని గుర్తించటమ్ఫు ఓటు పొందిన మాత్రం చేత ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే అధికారం, నిర్ణయించే అధికారం లేవని, చట్టం, రాజ్యాంగం అందరికీ

సమానంగా వర్తిస్తాయని గుర్తించటం – ఇవి ప్రజాస్వామ్య సంస్కృతికి మూలాధారాలు. ప్రజలకి ప్రభుత్వం జవాబుదారిగా ఉండాలన్నా, రాజకీయంగా ఆరోగ్యకరమయిన పోటీ, ప్రత్యామ్నాయ విధానాలు, వ్యక్తులు ప్రజల ముందు ఉండాలన్నా భావప్రకటనాస్వేచ్ఛని, వ్యక్తి స్వేచ్ఛని, ప్రజాస్వామ్య సంస్కృతిని ప్రోత్సహించటం అత్యవసరం.

రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఒక 70 ఏళ్ళపాటు ప్రపంచమంతా ప్రజాస్వామ్యానికి, వ్యక్తి స్వేచ్ఛకి, భావప్రకటనకి, పత్రికాస్వేచ్ఛకి, ఉదార విలువకి గౌరవాన్నిచ్చింది. నియంతృత్వం, ప్రభుత్వ గుత్తాధిపత్యం ఏ రూపంలో ఉన్నా అవి అప్రతిష్ఠని మూటకట్టుకున్నాయి, ప్రజల ఏవగింపుకి గురయినాయి. ఆయా దేశాలలో ఓటుహక్కు, ప్రజాస్వామ్యం లేకపోయినా, మానవ విలువలు, ప్రజాస్వామ్య సంస్కృతి, భావప్రకటనా స్వేచ్ఛలని కాలరాస్తే ప్రపంచమంతటా కళంకానికి గురవుతామన్న భయం ఎంతోకొంత ఉండేది. కాని గత కొద్ది సంవత్సరాలుగా పరిస్థితి కొంత మారుతోంది. స్వేచ్ఛకి పత్రికగా నిలిచిన అమెరికాలోని పరిణామాలు, పోలెండ్, స్లోవేకియా, ఇతర యూరపు దేశాలలో పెరుగుతున్న అసహనం, రష్యా, చైనా, టర్కీ ఫిలిప్పిన్స్, బ్రెజిల్ మరెన్నో దేశాలలో పెరుగుతున్న సంకుచితవాదం, అసహనం, ఇటీవల సౌది అరేబియాకి చెందిన పాత్రికేయుడు ఖాషోగ్గీని టర్కీలో తన స్వదేశ దౌత్యకార్యాలయంలో దారుణంగా హత్య చేసినట్లు బయటపడుతున్న సాక్ష్యాలు – ఇవన్నీ ప్రపంచమంతటా అతివాద సంకుచిత ధోరణులు, అసహనం పెరుగుతున్నాయని సూచిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో, ఆర్థికస్వేచ్ఛలో, పరిమిత ప్రభుత్వంలో, వ్యక్తిస్వేచ్ఛని గౌరవించటంలో ఎన్నో లోపాలు, ఇబ్బందులు ఉండవచ్చు. కాని ఈ ఉదార భావాలు, హేతుబద్ధ చర్చలు, మానవ విలువలు ప్రపంచాన్ని గత 250 సంవత్సరాలుగా తీవ్రంగా ప్రభావితం చేసి మానవ చరిత్రనే సమూలంగా మార్చేశాయి. వ్యక్తుల హుందాతనానికి, స్వేచ్ఛకి గతకాలంలో ఎన్నడూ ఇంతటి ఆదరణ, గౌరవం లేవు. గత శతాబ్దంగా ప్రపంచమంతటా మనందరికీ అందుబాటులోకి వచ్చిన అభివృద్ధికి, చాలామేరకు బీదరికం తగ్గటానికి, సగటు జీవనకాలం పెరగటానికి, వ్యాధులు అదుపుకావటానికి, విద్య, ఎదిగే అవకాశాలు క్రమక్రమంగా విస్తరించటానికి, సంపద, సౌకర్యాలు పెరగటానికి మూలకారణం మానవ విలువల పట్ల, వ్యక్తిస్వేచ్ఛ పట్ల పెరిగిన గౌరవం, వివిధ భావాలు, దృక్పథాల మధ్య శాంతియుతంగా సయోధ్య సాధించే బహిరంగ చర్చ, ప్రజాస్వామ్య సంస్కృతి బలపడటం.

మానవజాతి ఆధునికయుగంలో ఒకవంక ప్రగతిశీల భావాలని అంగీకరించి మనిషి జీవితాన్ని సుసంపన్నం చేస్తుండగా, మరోవంక సమాజంలో సంకుచిత ధోరణులు, అసహనం, అభద్రత కూడా ఇటీవలికాలంలో పెరుగుతున్నాయి. ఆర్థిక అభద్రత వల్ల, మతం పేరుతో చెలరేగిన ఉగ్రవాదం వల్ల, సంకుచిత, అతివాద ప్రభుత్వాలు, దూరదృష్టిలేనివారు అధికారంలోకి రావటమ్మో తమ సమస్యలకి 'పరాయి' వాళ్లు కారణమనుకునే ఆదిమ తెగల నాటి ధోరణులు, కేవలం జనాకర్షణ కోసం హేతుబద్ధ చర్చల స్థానంలో తిట్లు, శాపనార్థాలతో కూడిన అనాగరిక చర్చ పెరగటం, అధికారమే సర్వస్వంగా భావించే వికృత రాజకీయానికి కళ్ళెం వెయ్యలేకపోవటం – ఇలా వివిధ కారణాలుగా ప్రపంచమంతటా భావప్రకటనాస్వేచ్ఛకి, పత్రికాస్వేచ్ఛకి సంకెళ్ళు పడుతున్నాయి.


పత్రికలలో కూడా కొన్ని పొరపాట్లు దొర్లవచ్చు. ప్రజల జీవితాలని గూర్చి పట్టించుకోకుండా అధికారక్రీడలోనే పత్రికలు మునిగితేలుతున్నాయి. అంతటితో ఆపకుండా కొన్ని పత్రికలు పక్షపాత ధోరణితో ప్రజల కోసం కాకుండా తమ యజమానుల ప్రయోజనాల కోసం, కొన్ని పార్టీలు, నాయకుల కోసం కొమ్ముకాస్తున్నాయి. లాభాపేక్ష తప్ప ప్రజాప్రయోజనాలకి పెద్దపీట వెయ్యటం లేదు. ఒకవేళ సంకల్పం మంచిదయినా చాలామంది పాత్రికేయులలో కనీసమయిన వృత్తి ప్రమాణాలు, పరిజ్ఞానం కరువయినాయి. రణగొణధ్వని తప్ప, మంచి ప్రమాణాల చర్చ, హేతుబద్ధ వాదనలు తగ్గిపోతున్నాయి. సమస్యల పరిష్కారానికి దోహదం చెయ్యకుండా పత్రికలు తరచు సమస్యలో భాగమవుతున్నాయి. ప్రజల జీవితాల మీద, సమాజం అవసరాల మీద దృష్టి పెట్టకుండా సంపన్నుల విలాసాల మీద, వినిమయ సంస్కృతి మీద దృష్టి పెట్టి లేకి ధోరణుల్ని, సంకుచితత్వాన్ని పెంచుతున్నాయి. ఇవన్నీ సబబయిన విమర్శలే.

కాని స్వేచ్ఛని సద్వినియోగం చేసుకోకపోతే దానికి పరిష్కారం నియంతృత్వం కాదు్మ స్వేచ్ఛ లేకుండా చెయ్యటం కాదు. ఒకవేళ భావ ప్రకటనాస్వేచ్ఛ వెర్రితలలు వేసినా, అరుదయిన సందర్భాలలో, సమాజంలో హింసని కావాలని ప్రోత్సహించే సందర్భాలలో తప్ప చట్టం ద్వారా పత్రికలని అరికట్టటం ప్రమాదానికి, నియంతృత్వానికి దారితీస్తుంది. పాఠకులకి ఏ పత్రిక చదవాలో నిర్ణయించుకునే హక్కు, ఏ పుస్తకం కొనాలో కోరుకునే స్వేచ్ఛ ఉన్నంతకాలం, జనమాధ్యమాల మధ్య పోటీ ఉన్నంతకాలం, ఎప్పుడు ఏ ఛానల్‌ని మార్చాలో నిర్ణయించే రిమోట్ కంట్రోల్ ప్రేక్షకుల చేతుల్లో ఉన్నంతకాలం, పత్రికలలో దొర్లే పొరపాట్లకి, అపశృతులకి విరుగుడు సమాజంలోనే ఉంటుంది. పోటీ ద్వారా, స్వేచ్ఛ ద్వారా, సమాజం చూపే ఆదరణ ద్వారా తప్ప, హింస ద్వారా, అసహనం ద్వారా, అధికారం ద్వారా, చట్టం ద్వారా భావప్రకటనని హరించే ప్రయత్నం చేస్తే అది ప్రజాస్వామ్యాన్ని, ఉదార విలువలను, మానవ ప్రగతిని మంట కలుపుతుంది. తలనొప్పికి తలకాయని నరికేయటం పరిష్కారం కాదు, అది వినాశనానికి దారితీస్తుంది. ■

(కర్టెసీ: ఈనాడు)

# గాంధీజీ అర్థమైతే.. యువత ఆయన్ని వదలరు: జేపీ

**మహాత్మాగాంధీ 150వ జన్మదినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలో 'గాంధేయం' పేరుతో నిర్వహించిన.. గాంధేయం భారతీయ జీవన వేదం, 150 గాంధీజీ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రత్యేక అతిథిగా, ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఇందులో ఆవిష్కరించిన 150 గాంధీ విగ్రహాలనూ జిల్లాలోని 150 హైస్కూళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో 'భావితరం-గాంధేయం'పై జేపీ చేసిన ప్రసంగం స్థూలపాఠం:**




సభకి నమస్కారం!

ఇలాంటి అంశాల మీద వాగాడంబరం కంటే ఆచరణ చాలా ముఖ్యం. ఎన్ని మాటలు చెప్పాము అన్న దానికంటే.. ఎంత చిత్తశుద్ధితో ఆచరించాము అన్నది ముఖ్యం. ముందుగా శ్రీకాకుళం జిల్లా ప్రజల్ని, శ్రీకాకుళంలో ఉన్న పౌరసమాజ బృందాలని, ముఖ్యంగా సోదరుడు రామ్మోహన్‌ని, సుజాత దంపతుల్ని, గాంధీ స్మారక నిధి బృందాన్ని, భాగస్వాములైన ఎన్నో పాఠశాలల యాజమాన్యాల్ని, ఉపాధ్యాయుల్ని, అధ్యాపకుల్ని, పాత్రికేయులను, పిల్లల్ని మనసారా అభినందిస్తున్నాను.

ఈవేళ గాంధీ గారికి అపచారం జరిగితే సమాజంలో పట్టించుకునే స్థితి లేకుండా పోయింది. ఎందుకంటే, గాంధీగారికి కులం లేదు, ఆయనకి మతం లేదు. ఆయనని కేవలం గుజరాతీ బనియాగా చిత్రీకరిస్తే.. ఆయన తరఫున వచ్చేవాళ్లు ఒక్కడు కూడా లేడు. మిగతావాళ్లందరికీ ఏదో ఒక కులం ఉంది, ఏదో ఒక మతం ఉంది, ఏదోక పార్టీ ఉంది, ప్రాంతం ఉంది. కాబట్టి వాళ్ల కోసం పోరాడేవాళ్లు ఉన్నారు. కానీ ఎక్కడో గాంధీగారు పుట్టింది పోరుబందరులో. మాట్లాడింది గుజరాతీ, హిందుస్థానీ, ఆంగ్ల భాషలు. ఎప్పుడో ఒకసారి మన ఊరు వచ్చారు. కొన్నిచోట్ల ఆయన వచ్చారని చెబుతారు, కొన్నిచోట్ల నిజంగా వచ్చారు, కొన్నిచోట్ల రాకపోయినా ఆయన మహాత్ముడిగా వర్ధిల్లారు కాబట్టి, ఊహాగానాలు చేసి మా ఊరు వచ్చారని చెబుతారు. ఏ ఊరు వెళ్లినా కూడా గాంధీగారు వచ్చారని చెబుతారు. కానీ ప్రధానంగా ఆయన, జీవనపర్యంతం దేశంలో అన్ని ప్రాంతాలూ, ప్రధానంగా ఉత్తరాదిన గడిపినా కూడా ఎక్కడో మారుమూల ఉన్న ఈ సిక్కోల్లో, ఆయన పుట్టిన 150 ఏళ్ల తర్వాత, ఇంతమంది పెద్దలు ఈ కార్యక్రమానికి పూనుకున్నారంటే గాంధీజీ ప్రభావం ఈనాటికీ మన సమాజంపైన ఎంత బలంగా ఉందో రుజువు చేస్తోంది. 2 అక్టోబర్‌న తప్ప ఆ విషయాన్ని పూర్తిగా మర్చిపోయినటువంటి అధికార వ్యవస్థలో, గాంధీ గారిని గుర్తుంచుకున్నామన్నమాట అబద్ధం. ఊరికే ఒక దండ వేస్తాం, ఒక విగ్రహం ఉంటే ఒక దండం పెట్టేస్తాం. అంతకుమించి గాంధేయం ఇవాళ మన ప్రజాజీవనంలోగాని, మన రాజకీయంలోగాని, మన పరిపాలనలో గాని, మన ప్రజాస్వామ్యంలోగానీ – ఈ మాటలు చాలా బాధతో అంటున్నాను– ఈషణ్మాత్రం లేదు! అలాంటి నేపథ్యంలో ఈవేళ శ్రీకాకుళం చిన్నారులుగానీ, మరి అద్భుతమైన నాట్యప్రదర్శన చేసి మనలందరినీ అలరించి కళ్లు చెమ్మరిల్లేలా చేసిన ఆ బాలలుగానీ, వాళ్లందరికీ ఆ నృత్యభంగిమలు నేర్పినటువంటి శ్రీకాంత్‌గానీ– నేను ఇప్పటిదాకా వినలేదు, ఇవాళే విన్నా – గుండె లోతుల్లోనికి చొచ్చుకు పోయే అద్భుతమైన గేయాన్ని రాసినటు వంటి సుద్దాల అశోక్ తేజ గానీ.. మనకు మళ్లీ ఎందుకు గాంధీని గురించి ఆలోచించాలి అన్నది గుర్తు చేసే ప్రయత్నం చేశారు.

గాంధీగారికి విగ్రహాలు పెట్టకపోతే, దండలేయకపోతే ఆయనకేమీ నష్టం లేదు. ఎలాగూ ఆయన బతికి ఉండగానే చంపేశాం. ఆయన్ని చంపేయకపోతే ఆయన పాపం కుమిలికుమిలి చచ్చిపోయేవారు. గాంధీగారి అదృష్టంకొద్దీ ఆయన్ని వాడు చంపేశాడు. చంపాడు కాబట్టే ఆయన కీర్తి మరింత పెరిగింది, లేకపోతే ఆయన చాలా వేదనతో ఉన్నాడు ఆ కాలంలో!





ఇందాక పిల్లల్ని అడిగాను. 'అమ్మా, ఎందుకు ఇవాళ ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు? ఎవరీ పెద్దాయన?' గాంధీ గారు ఎవరు? ఏంటి? అని. 'సార్, స్వాతంత్ర్యం తెచ్చారు' అన్నారు వాళ్లు. నేనా పాపకి చెప్పాను, ఇప్పుడు మీకు చెబుతున్నాను. 'గాంధీగారి వల్ల స్వాతంత్ర్యం రాలేదు. ఆయన లేకపోయినా వచ్చి ఉండేది. తెల్లవాడు పారిపోయాడు – ఇంక మేము చెయ్యలేమయ్యా, మాకు శక్తి లేకపోయింది, మా బతుకు మేం చూసుకుంటాం అని! గాంధీగారి గొప్పతనం స్వాతంత్ర్యం తేవడం కాదు. గాంధీగారు లేని దేశాలకు కూడా స్వాతంత్ర్యం వచ్చింది. గాంధీగారు లేకున్నా కచ్చితంగా మనకు స్వాతంత్ర్యం వచ్చి ఉండేది. గాంధీగారు 5,000 సంవత్సరాల చరిత్రలో తొలిసారిగా ఒక సంస్కృతిని ఒక జాతిగా తీర్చిదిద్దారు. ఆయన లేకపోతే భారతదేశం లేదు. ఆయన లేకపోతే.. ఎన్నో కులాలున్నాయి ఎన్నో మతాలున్నాయి, ఎన్నో భాషలున్నాయి, ప్రాంతాలున్నాయి గానీ, ఒక దేశం లేదు! ఆ దేశం కేవలం ఓ చట్టం రూపంలో, రాజ్యాంగం రూపంలో రావడం కాదు. మనందరికీ కూడా ఉమ్మడి ప్రయోజనాలు ఒక్కటే. కాశ్మీరులోనో, గంగా నదీలోయలోనో, ఈశాన్య భారతంలోనో ఎవరికన్నా అన్యాయం జరిగి గుండె తల్లడిల్లితే.. అది మనందరికీ బాధని కలిగించాలి, మన కంట కన్నీరు ఒలకాలి. అదీ నిజమైన దేశభక్తి భావం. ఆ దేశభక్తిని మొట్టమొదటిసారిగా ఈ జాతికి అందించింది మహాత్మాగాంధీ. గాంధీజీ లేకపోతే జాతినిర్మాణం లేదు. స్వాతంత్ర్యం, వీడు కాకపోతే వాడు పరిపాలిస్తాడు, పెద్ద తేడా ఉండదు. కానీ జాతిని నిర్మాణం చేసింది ఆయన. అందుకోసం ఆసేతు హిమాచలం ఆయన్ని గుర్తుంచుకుంటున్నారు'.

గాంధీగారు చేసిందేమిటో అర్థంకాకపోవచ్చుగానీ అప్రయత్నంగానే మన మనసులో ఒక ఆరాధనాభావం నెలకొంది గాంధీగారి మీద. గాంధీతో విభేదించే వాళ్లలో కూడా. ఆయన కొన్ని చర్యలను నేను ఇప్పటికీ విభేదిస్తున్నాను. గాంధీ గారు చేసినవి మొత్తం అంగీకరించాల్సిన అవసరం లేదు. కానీ మౌలికంగా ఈ జాతినిర్మాణం, ఇన్ని కోట్లమందిని కలిపి ఉంచిన జాతినిర్మాణం పూర్తిగా గాంధీజీ వల్లే జరిగింది. పిల్లలు అర్థం చేసుకోవాలి. ఆ పాట నాకు ప్రత్యేకంగా నచ్చింది. ఎందుకంటే, గాంధీగారు ఇంకా ప్రజాజీవనంలోకి రాకమునుపే, మన గురజాడగారు 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నారు. 1890 దశకంలో గాంధీగారు ఎవరో ఎవరికీ తెలీదు. ఆయన ఊళ్లో తెలుసేమో, ఇంకెవరికీ తెలీదు. ఆ తరువాత ఆయన సౌత్ ఆఫ్రికా వెళ్లారు 90వ దశకంలో. 1893 నుంచి 1915 దాకా 23 ఏళ్ల పాటు సౌత్ ఆఫ్రికాలో ఉన్నారు. కొంతకాలంపోయాక ఆయన చేస్తున్న పనులు కొంత మనకు తెలుస్తూ వచ్చాయి. కానీ అప్పటికే మన గురజాడ అసలు సమాజ స్వరూపాన్ని, రేపొద్దున స్వతంత్రం అంటూ వస్తే స్వతంత్రానికి అర్థాన్ని విడమర్చి చెప్పే ప్రయత్నం చేశారు. అందుకనే, బండివాడితో అడిగించారు. 'అయ్యా గిరీశం బాబూ! స్వతంత్రం వస్తే.. మా ఊళ్లో హెడ్‌కానిస్టేబులు అందరినీ హింస పెడుతున్నాడు, వాడిని బదిలీ చేస్తారా కాంగ్రెస్ వాళ్లు?" అని అడిగాడు. అంటే 'స్వతంత్రానికి అర్థం ఊర్కే గ్యాస్ కొట్టడం కాదయ్యా, స్వత్రం అంటే వందేమాతరం కాదయ్యా, స్వతంత్రం అంటే భరతమాతకి దండం పెట్టడం కాదయ్యా, స్వతంత్రం అంటే.. జనం భవిష్యత్, స్వతంత్రం అంటే జనం బతుకులు, బాగోగులు, మన ఉమ్మడి ప్రయోజనాలు, మన పన్నుల డబ్బుతో, మనం ఇచ్చే ఓటుతో లేక మన సమ్మతితో మన కోసం ఏమి జరుగుతుందో అర్థం చేసుకునే ప్రక్రియ. లేకపోతే అది స్వతంత్రం కాదు' అని ఆనాడే గురజాడ చెప్పారు. దాన్ని పూర్తిగా తూచ తప్పక నమ్మిన ఏకైక జాతీయ నాయకుడు మహాత్మాగాంధీ.

1947, 15 ఆగస్టున దేశమంతా సంబరాలు చేసుకుంటోంది. ఇవాళ మనం ఇక్కడ వేదిక మీద తొక్కిసలాడినట్టుగా ప్రతివాళ్లూ మన ఫోటో కనిపిస్తోందా, మన పేరు కనిపిస్తుందా, మన మొహం కనిపిస్తోందా అని ఆనాడు దేశమంతటా తంటాలు పడ్డారు. కానీ దేశ నిర్మాణం చేసిన మహనీయుదున్నాడే, ఆయన ఢిల్లీకి 1600 కిలోమీటర్ల దూరంలో ఉపవాసం చేస్తూ కన్నీళ్లు కారుస్తూ కూర్చున్నారు. ఎర్రకోట దగ్గర లేరు, ఇవాళ్టి పార్లమెంటు ప్రాంగణంలో లేడాయన, ఢిల్లీ నగరం దగ్గరే లేదు. ఒక్క టీవీ ఛానల్ లేదు ఆనాడు, ఒక్క రేడియో లేదు, ఒక్క పాత్రికేయుడు లేడు, ఎవడూ లేడు.. ఆనాడు ఆయన





వద్ద. మౌనంగా కలకత్తా నగరంలో కన్నీళ్లు కారుస్తూ తిండితినకుండా మలమలలాడాడు. ఎందుకని?

దాన్నుంచి రెండు అంశాలు మన పిల్లలకి అర్థం కావాలి. కీర్తి కోసం, గుర్తింపు కోసం కాదు మనం చేయవలసిన పోరాటం.. ఉమ్మడి ప్రయోజనాలనే లక్ష్యం కోసం ప్రాణమైనా ఫణంగా పెట్టాలి, నిశ్శబ్దంగా పెట్టాలి, హడావుడి లేకుండా పెట్టాలి.. ప్రచారం కోసం కాదు! అంతకుమించి రెండోది ఆయన తన జీవితంలో చెప్పింది.. మళ్లీమళ్లీ చెప్పారాయన– తెల్లవాడు వెళ్లిపోయి, ఆ జెండా వెళ్లిపోయి మన జెండా వచ్చినంత మాత్రం చేత అది స్వరాజ్యం కాదు! అధికారం మార్పిడే కానీ అది నిజమైన స్వరాజ్యం కాదని ఆయన పూర్తిగా నమ్మారు. నిజాయతీగా నమ్మాడు.

నేను ఇప్పుడే ఏ సంవత్సరమో గుర్తుచేసుకోవడం కోసం చూశాను. ఎప్పుడో 1915లోనే బెనారస్ హిందూ యూనివర్సిటీ సంగతి. మదన్‌మోహన్ మాలవీయ, అనీబిసెంట్ నాయకత్వంలో ఆ యూనివర్సిటీ వ్యవస్థాపక కార్యక్రమం జరుగుతుంటే, ఆనాటి వైస్రాయ్ ఆ సభలో పాల్గొన్నారు. చాలామంది ప్రముఖుల్ని, మహాత్మాగాంధీతో సహా పిలిచారు. అందరూ మామూలుగా ప్రసంగం చేస్తే, ఆయన (గాంధీజీ) నిర్మొహమాటంగా, నిష్కర్షగా, వాళ్లందరికీ మొహాలు పగిలేట్టుగా, వాళ్లకి కోపం వచ్చేట్టుగా మాట్లాడారు. చివరికి ఆయన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపిచ్చేశారు– ఏంటి ఈ తిక్కోడు తిక్కతిక్కగా మాట్లాడుతున్నాడని అనీబిసెంట్ ఆయన్ని మాట్లాడకుండా కూర్చోబెట్టారు. నిజాయతీ అంటే ఇందాక చెప్పారు. నిజం చెప్పడం కాదు, తనకితాను సత్యాన్ని చెప్పుకోవడం! ఆత్మవంచన లేకుండా ఉండడం!! ప్రాణం పోయినా కూడా తన్ను తాను మోసం చేసుకోకుండా ఉండడం!!!

సందర్భం ఏదైనా కావచ్చు, ఎదుటివాళ్లు చప్పట్లు కొట్టచ్చు లేదా తిరస్కరించవచ్చు, ఉరికంబం వేయొచ్చు, రాళ్లు వేయొచ్చు, కానీ నమ్మినదాన్ని చెప్పాలి, నమ్మేదానికి ఆధారం ఉండాలి.. అని ఆనాడే చెప్పాడాయన. ఆయన అప్పుడే చెప్పాడు– 'రేపొద్దున తెల్లవాళ్లు ఎట్లాగూ పోతారు. ఇవాళ కాకపోతే రేపైనా వాళ్లు అలసిపోయి పోతారు. ఎల్లకాలం ఉండలేరు. నేను నిన్న వారణాసి నగర వీథుల్లో తిరిగాను. ఎంత ఘోరంగా ఉన్నాయి! మన తప్పులకి, మన అపరిశుభ్రతకి తెల్లవాళ్లని నిందించలేం'. ఆ యూనివర్సిటీ సమావేశం వారణాసిలో జరిగింది. ఇవాళ కూడా ఎవరైనా వారణాసి వెళ్తే, పుణ్యక్షేత్ర దర్శనానికి ముక్కులు మూసుకోవలసి వస్తుంది. మినరల్ వాటర్ తాగాల్సి వస్తుంది. ఊపిరి బిగబట్టి.. హమ్మయ్య! ఈవేళ మనం బతికాం, అని బయటికి రావాల్సి వస్తుంది. ఇంక ఆనాడు ఎట్లా ఉందో మీరు ఊహించగలరు. ఇలాంటి సమాజం స్వతంత్రానికి అర్హమా? అని గాంధీ అడిగాడు. తెల్లవాడు పోతాడు సరే, మనల్ని మనం పరిపాలించుకునే ధీమా మనకి ఉందా? కనీసమైన సంస్కారాన్ని మనం ప్రజలకు నేర్పకుండా. మనం చేసే చర్యలు– తుపుక్కున ఉమ్మి వేయడం దగ్గర్నుంచి, అధాటున డొక్కల్లో మోచేత్తో పొడవడం దగ్గర్నుంచి, ఒకళ్లనొకళ్లు తోసుకుని ముందుకు వెళ్లాలని ఉబలటపడడం దగ్గర్నుంచి.. ఇలాంటి పనులు చేస్తే స్వతంత్రానికి అర్థమేమిటి? వ్యక్తి ప్రవర్తన సమాజంలో ఇతరులకి ఎలాంటి అసౌకర్యాన్ని కలుగజేస్తుందో, లేకపోతే మంచిని కలుగజేస్తుందో అర్థంకాని దేశం దేశంకాదు, అక్కడిది స్వపరిపాలన కాదని ఆనాడే చెప్పాడాయన. నిర్ద్వంద్వంగా చెప్పాడాయన! ఆ నేపథ్యంలో ఇవాళ గాంధీగారిని అర్థం చేసుకోవాలి. ఇందాక డాక్టర్ గాంధీగారు, నేను మాట్లాడుకున్నాం. అద్భుతమైన పౌరులు, ఆనాటి నుంచి ఈనాటి దాకా తరతరాలుగా మహాత్మాగాంధీ ఆలోచనలని అర్థం చేసుకుని జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, ఏమిటి నిజమైన ఆలోచన? ఇంక ఇంతకంటే ఎక్కువ మాట్లాడను. చాలావరకు క్లుప్తంగా 6 అంశాలు:

మొట్టమొదటిది, నేను ఇందాకే చెప్పినట్టుగా ఈ ట్రైబలిజానికి అతీతంగా, ఈ కులం, మతం, ప్రాంతం, భాషకి అతీతంగా, మన జాతికందరికీ ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయన్న స్పృహ మనందరినీ కూడా ప్రేరేపించకపోతే మన దేశభక్తి అబద్ధము, మన ప్రజాస్వామ్యం బూటకము, గాంధీజీ పట్ల మనం చూపెట్టే ఆదరణ అసత్యము! గుండె మీద చెయ్యి వేసుకోండి. మన మనసుల్లో ఒక మనిషిని చూడగానే.. వాడి కులం ఏంటి? వాడి ఊరేంటి? వాడి మతమేంటి? వాడు ఏ పార్టీ? వాడు వేరే పార్టీ అయితే వాడి ఇంటి మీద కాకి మన ఇంటి మీద వాలడానికి





వీల్లేదు. వాడు వేరే కులమైతే వాడిని చులకన చెయ్యాలి. మన కులం అయితే పనికిమాలినవాడైనా వాడిని పెంచాలి.. ఈ భావం మనందరి మనసుల్లో ఉందా లేదా? ఈ చిన్నారులకు లేదు ఇది. అయితే అందరిలా వాళ్ల తల్లిదండ్రులకు ఉందా, లేదా?.. అది ఉన్నంతకాలం గాంధీజీని స్మరించే అర్హత మనకి లేదు.

గాంధీజీకి ఆత్మ అంటూ ఉంటే అది ఉన్నంతకాలం ఆయన ఆత్మ సంతృప్తి చెందదు, క్షోభిస్తుంటుంది. ఈ అడ్డుగోడలకి అతీతమైనది. ఠాగూర్ చెప్పారు– కృత్రిమమైనవి ఈ అడ్డుగోడలు. **Narrow domestic walls.** ఈ అడ్డుగోడలకి అతీతమైనటువంటి, ఈ జాతిని ముక్కలుముక్కలుగా నరుకుతున్నటువంటి ఈ విభజనలకతీతంగా మనందరి ప్రయోజనాలఉన్నాయని ఆలోచించే శక్తి మనకి లేకపోతే, మాటల్లోనే కాదు నిజంగా ఆలోచనలు, చేతలు కావాలి. లేకపోతే.. గాంధీజీ గురించి మాట్లాడ్డం వ్యర్థం. ఇందాక ధనుంజయ్‌రెడ్డిగారు చెప్పారు, మన ఎంపీగారు రామ్మోహన్‌నాయుడుగారు చెప్పారు ఎలా ఇతర దేశాల్లో స్ఫూర్తిని పొందారో! ఓ మార్టిన్ లూథర్ కింగ్, ఓ నెల్సన్ మండేలా, ఓ ఆంగ్‌సాన్ సూచీ, ఓ బరాక్ ఒబామా, మరెందరో! నిజంగా చెబుతున్నాను, మనం కాదు గాంధేయులం.. వాళ్లు! గాంధీ ఆత్మను అర్థంచేసుకున్న వాళ్లు ఇతర దేశాల్లో ఉన్నారు. మనం గాంధీ విగ్రహాలు పెడుతున్నాం. కానీ వాళ్లు నిజంగా ఆచరిస్తున్నారు. మనం గాంధీజీని అనుకరిస్తున్నాం. చొక్కాలేకుండా కొల్లాయి గుడ్డ ఉంటే బాగుంటుంది అనుకుంటున్నాం, అదే గాంధీయేమో అనుకుంటున్నాం.

ఒక ప్రజాస్వామ్య సమాజంలో మన ఆచరణ, నిత్య జీవితంలో పదిమందితో మన ఆచరణ ఏరీతిలో ఉన్నది అన్నదే నిజమైన గాంధేయవాదానికి నిదర్శనం.

రెండోది, మహాత్మాగాంధీ ప్రపంచం మొత్తానికి ఇచ్చిన అద్భుతమైన వరం, ప్రపంచమంతా పాటిస్తున్న వరం. ఏమిటది? 'అన్యాయాన్ని ఏనాడూ సహించబోకు, మౌనప్రేక్షకుడిగా మిగిలిపోబోకు, ఎదురుతిరుగు. కానీ అదే సమయంలో సంఘర్షణ హింసకు వెళ్లనీబోకు. అది.. ఆ సంఘర్షణ హింసకు తక్కువగా ఉండాలి, మౌన అంగీకారానికి ఎక్కువగా ఉండాలి. మధ్యలో ఉండాలి. క్రియేటివ్ టెన్షన్. అది కులవ్యవస్థ కావచ్చు, లైంగిక వివక్ష కావచ్చు, వర్ణ వివక్ష కావచ్చు, భాషల మధ్య వైరుధ్యం కావచ్చు, భారత్–పాకిస్తాన్ మధ్య విభేదాలు కావచ్చు. ఏనాడూ అన్యాయాన్ని సహించకు, చూస్తూ కూర్చోబోకు. ఎదురుతిరుగు, పోరాడు, గొంతువిప్పు. మార్పు కోసం నిరంతరం ప్రయత్నం చెయ్యి. కానీ అది హింసాత్మక సంఘర్షణ దారికి వెళ్లనీయబోకు'. ప్రపంచం మొత్తం అర్థం చేసుకుంది ఇవాళ అదే. అది తప్ప వేరే మార్గం లేదు. గాంధీగారు చెప్పారని కాదు. కానీ అది లేకపోతే.. ఆయన అదే అన్నారు– **An eye for an eye makes the whole world blind.** కంటికి కన్నే బదులైతే లోకమంతా గుడ్డిదవుతుంది. ఇవాళ కులం రిజర్వేషన్ల దగ్గర్నుంచి, ప్రాంతీయ విభేదాల దగ్గర్నుంచి, కొత్తగా పార్టీ పేట్రియాటిజం దగ్గర్నుంచీ, పార్టీయే దేశభక్తిగా మారిపోయింది. మా పార్టీ కొత్తది, మా పార్టీ భక్తే దేశభక్తి, ఇంకో పార్టీ భక్తి ఉంటే దేశద్రోహి. ఇలా తప్పు ఎలా సంఘర్షణ లేని రీతిలో, హింస రాని రీతిలో, అదే సమయంలో యథాతథ స్థితి కొనసాగించకుండా, శ్మశాన నిశ్శబ్దాన్ని సహించకుండా మార్పుకు ఎలా దోహదం చేయాలి?.. ఆయన జీవనపర్యంతం చేసిందది. ఆయన నమ్మేవాళ్లు ప్రపంచమంతా చేస్తున్నదది, సాధిస్తున్నదది.

మూడోది, నేను మాట్లాడే మాటలు కొందరికి కటువుగా అనిపించవచ్చు. వ్యక్తుల గురించి మాట్లాడటల్లా. మన వ్యవస్థని గురించి మాట్లాడేటప్పుడు నిజాయతీగా మాట్లాడుకోవాలి. జీవితమంతా గాంధీగారు పోరాడింది 'రాజకీయం పవిత్ర వ్యాసంగం' అని. ఒకరకంగా దానికి నేను పేటెంట్ తీసుకున్నాను. రాజకీయం పవిత్ర వ్యాసంగం అన్న మాట నా నోటి నుంచి కొన్ని వేలసార్లు వచ్చి ఉంటుంది. అది మనసా, వాచా, కర్మణా నమ్మి ఆచరించిన మహనీయుడు మహాత్మాగాంధీ! ఇవాళ ఒక్కసారి గుండె లోతుల్లోకి తొంగి చూసుకుందాం మనం.

ఎవరన్నా రాజకీయంలో ఉంటే.. సోదరుడు రామ్మోహన్ మంచి మనిషి. ఎవరన్నా తెలీనివాడు కలిస్తే ఏమి చెప్పుకోవాలి? నేను ఎంపీగా ఉన్నాను సార్, కానీ నేను అట్లాంటోడిని కాను సార్, మిగతా రాజకీయ నాయకుల్లా కాదు సార్ నేను, వేరే సార్ అని చెప్పకపోతే.. ఇది చాలా భయంకరము, కుట్రపూరితము, అవినీతిమయమైనది, ఇది దుర్మార్గము, ఇది దోపిడీ అన్నది అప్రయత్నంగా మన మనసుల్లోకి వచ్చేసింది.





ఏమన్నా చెడు చేస్తుంటే.. ఏయ్, రాజకీయం చేయబోకయ్యా అంటుంటాం.

మనం ప్రతిరోజూ చూస్తున్నాం.. దేశవ్యాప్తంగా పార్టీలకతీతంగా, ప్రాంతాలకతీతంగా ఎవరు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎంత హింసావాదాన్ని, ఎంత అసహ్యాన్ని, ఎంత ద్వేషాన్ని పెంచుకుంటున్నాం, ఎంత అశ్లీలతని రాజకీయంలో చొప్పిస్తున్నాం, ఎంత వల్గారిటీని ప్రవేశపెట్టాం, ఎంత మనిషి హుందాతనాన్ని కించపరిచాం!.. ఒక్కసారి గుర్తుచేసుకోండి. ఇంక గాంధీ మాట చెప్పే హక్కు మనకెక్కడ ఉందండి? రాజకీయాన్ని బూతు పదంగా మార్చిన జాతికి.. రాజకీయమే ఒక పవిత్ర వ్యాసంగం అని నమ్మినటువంటి, జీవించినటువంటి మహనీయుడికి నివాళులు అర్పించే అర్హత ఉందా? అర్హత ఎక్కడుంది, ఎట్లాఉంది మనకి? చెప్పండి ఎక్కడుంది?.. దాన్ని ఎలా తీసుకొస్తాం? తీసుకొస్తామా, లేదా?.. తీసుకొస్తే అప్పుడు గాంధేయం, అది లేకపోతే బూటకం.

నాల్గవది, సమాజంలో ఎక్కడ ఎవరు దగాపడుతున్నా కూడా ఆయన గుండె క్షోభించింది. ఈ దేశంలో చరిత్రను అర్థం చేసుకోలేకనో, అన్ని వర్గాల ప్రయోజనాల్ని సమన్వయం చేయటం కోసం ఒక మహనీయుడు అందరి బాధల్నీ తన బాధగా భావించి కన్నీళ్లు కారుస్తుంటే దాన్ని అపార్థం చేసుకునో ఇవాళ మహాత్మాగాంధీ దళిత వ్యతిరేకని కొందరు అనుకోవచ్చు. గాంధీజీ వేరు, అంబేద్కర్ వేరు అని కొందరు అనుకోవచ్చు. లేకపోతే గాంధీ మరో వ్యతిరేకని అనుకోవచ్చు. నిజంగా చరిత్ర తెలిసినవాళ్లు, మానవాళి పరిణామక్రమాన్ని అర్థం చేసుకున్న వాళ్లు, గాంధీ జీవితాన్ని ఆపోశన పట్టినవాళ్లకి మాత్రం ఈ సందేహాలు ఉండవు. మహిళల పట్ల వివక్ష ఉంటే ఆయన ప్రపంచంలో మొట్టమొదటి ఫెమినిస్టు. చాలా సింపుల్‌గా చెప్పాడాయన. పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇవ్వలేదు. మహిళని కూడా మనిషిగా గుర్తిస్తే.. మగవాడికి ఎంత స్వేచ్ఛ ఉందో, మహిళకీ అంతే స్వేచ్ఛ ఉంది, హక్కుల ఉన్నాయి. ఇంకో మాట కూడా అన్నారు. మహిళని అణచివేయాలని ప్రయత్నం చేస్తే, దాని పర్యవసానం మగవాడి దిగజారుడు. ఎందుకంటే మహిళని వంచించడం కోసం నువ్వు వంగాల్సి ఉంటుంది, నువ్వు తగ్గుతున్నావ్! మహిళ ఔన్నత్యంలో తన ఔన్నత్యం ఉందని చాలా స్పష్టంగా అర్థం చేసుకుని పాటించిన మహనీయుడాయన.

ఆనాడు దళితులంటేనే చూడ్డానికి కూడా ఇష్టపడనటువంటి సమాజంలో ఇంట్లో దళితుల్ని పెట్టుకుని, వాళ్ల మలమూత్రాలు తన చేతులతో తన భార్య చేతులతో ఆనాడు పరిశుభ్రం చేసిన మనిషి ఆయన. ఎంతటి ఆత్మస్థయిర్యం కావాలి, ఎంతటి ఆర్ద్రత కావాలి, హృదయం ఎంత విశాలం కావాలి! ప్రపంచమంతా ఆక్రమించే ఎంతటి వైశాల్యం ఉండాలి, ఎంతటి మానవ విలువలు కావాలి, మనిషి హుందాతనం పట్ల ఎంతటి నమ్మకం కావాలి!!

ఏ పని చేసినా కూడా.. చిన్న, పెద్ద పని కాదు. పదిమందికి పనికివచ్చే ప్రతి పని కూడా గౌరవప్రదమైనదే. డిగ్నిటీ ఆఫ్ లేబర్. నేను ఎన్నో సందర్భాల్లో చెప్పాను పబ్లిగ్గానే – ఎక్కడో దూరంగా ఉన్న జిల్లా కలెక్టర్ కంటే, మనింట్లో తూములు నిర్మించే ప్లంబర్ మిన్న అని! గాంధీజీ దాన్ని నిరంతరం పాటించారు. మనకి రోజూ చెప్పారు– మానవ విలువల కోసం, హుందాతనం కోసం, వివక్ష లేని సమాజం కోసం.

వివిధ రూపాల్లో ఇవాళ వివక్ష ఉంది. కొత్త రూపాల్లో వస్తున్నది. పాత రూపాల్లో ఇంకా కొన్ని సందర్భాల్లో కొనసాగుతోంది. దాన్ని నివారించటం కోసం, నిర్మూలించటం కోసం, హింసలేని రీతిలో మార్పు తేవటం కోసం నిరంతరం పోరాడితే.. అప్పుడు గాంధీ బతికి ఉన్నట్టు లెక్క.

ఐదవది, నాకు అన్నిటింకంటే ప్రియమైనది, అన్ని పార్టీలను ప్రతిరోజు నేను తిట్టిపోసేది, గాంధీజీ ప్రతిక్షణం బతికింది– సామాన్యుడి సాధికారత కోసంగానీ, ఢిల్లీలో ఎర్రకోట దగ్గర మువ్వన్నెల జెండా కోసం కాదు. ప్రధానమంత్రి ఆధిపత్యం కోసం కాదు. అమరావతి సీమలోనో, హైదరాబాద్ నగరంలోనో, బెంగళూరు శివార్లలోనో ముఖ్యమంత్రుల రాచరిక స్వభావం కోసం కాదు. ఏ ఊరుకావూరు, ఏ వీధికావీధి, ఏ పట్నానికాపట్నంలో పన్నులు కట్టే వాడికి అధికారం ఇవ్వటం ఎట్లా? ఓటు వేసే వాళ్లకి వాళ్ల భవిష్యత్తును నిర్దేశించే నిర్ణయం స్థానికంగా జరగటం ఎట్లా? ఆ ఓటు విలువ సామాన్యులకు అర్థమయ్యేలా వ్యవస్థ నిర్మాణం చేయటం ఎట్లా? ఇవి కొరవడటం వల్లే.. ఆయన స్వతంత్రం వచ్చిందని నమ్మలా. తెల్లోడు

పోయాదుగానీ, ఇది స్వరాజ్యం కాదని నమ్మాడు. అందుకే ఆయన టాలిస్‌మన్‌లో చెప్పారు– 'ఎప్పుడైనా ఏమన్నా పనిచేయాలా, వద్దా అనే సందేహం కలిగితే– తమ్ముడూ! ఒక్కసారి మారుమూల పూరి గుడిసెలో ఉన్న పేదవాళ్లని గురించి ఆలోచించు' అన్నారు. కానీ వాళ్లకి డబ్బులు ఇవ్వు, దానం చెయ్యి అనలా ఆయన. చాలామంది ఆయన్ని అపార్థం చేసుకుంటారు. 'నువ్వు చేస్తున్న పని వల్ల అతని జీవితం మీద అతనికి అధికారం వస్తే, అతని కాళ్ల మీద అతను నిలబడ గలిగితే, అతని ఆత్మగౌరవం వికసిస్తే అది పూర్తిగా చేయదగ్గది. అతని స్వావలంబన కోల్పోతే, అతను మరింత పరాధీనుడైతే, అతని ఆత్మగౌరవం దెబ్బతింటే నువ్వు చేసే పని చెయ్యకూడనటువంటిది'.. ఇంకేమీ అక్కర్లేదు, ఈ ఒక్క మంత్రాన్ని పాటించమన్నాడు. ఈవేళ ఈ దేశంలో ప్రభుత్వాలు, పార్టీలు చేస్తున్న దాదాపు ప్రతి పని సామాన్యుడి ఆత్మగౌరవాన్ని భంగం చేసేది, సామాన్యుడ్ని బిచ్చగాడిగా మార్చేది, సామాన్యుడి స్వావలంబన తగ్గించేది, సామాన్యుడి సాధికారతకు నిప్పు పెట్టేది! అధికార కేంద్రీకరణ– జనాన్ని బిచ్చగాళ్లలాగా చిన్నచూపు చూసేటి వ్యవహారం.

పన్నులు కట్టే ప్రజలకి నేను నీకు ఇది ఇస్తానని చెప్పడమా? సిగ్గుందా మనకి? ప్రపంచంలో అత్యంత హీనస్థానంలో విద్యను, ఆరోగ్యాన్ని పెట్టి ఈ సమాజాన్ని కాపాడుతున్నామని మీరు బీరాలు పలుకుతారా? బీద కుటుంబంలో పుట్టిన పాపానికి తెలివి ఉన్నా కూడా చదువందని వ్యవస్థ నిర్మాణం చేసి మేము గాంధీని గురించి మాట్లాడుతున్నామని అహంకరిస్తారా? ఏ అర్హత ఉంది మనకి? ఒక సమాజంగా మనందరం ఆ పాపంలో భాగస్వాములం.

చివరిది, ఇందాక రామ్మోహన్ చెప్పారు. గాంధీజీ ప్రపంచంలో ఎలాగైతే మొట్టమొదటి ఫెమినిస్టో, మొట్టమొదటి ఎన్విరాన్‌మెంటలిస్టు.. పర్యావరణవేత్త కూడా. ప్రకృతికి – మనిషికి సమతూకం లేకపోతే మనందరం నష్టపోతాం, మానవాళి నష్టపోతుందని చాలా స్పష్టమైన అవగాహనతో అనితరసాధ్యమైనటువంటి సాధారణమైన శైలిలో.. ఇందాక రామ్మోహన్ చెప్పిన మాటల్లో ఆయన చెప్పారు. **There is enough for man's needs, but not for man's greed.** మనిషి అవసరాలకు తగినంతగా ప్రకృతి మనకి ఇస్తున్నది, మనిషి అత్యాశకు తగినట్టుగా ప్రపంచంలో ఉన్న వనరులు చాలవని చెప్పారు.

గాంధీజీని గుర్తుంచుకోవాల్సింది విదేశీ వస్త్ర బహిష్కారం కోసం కాదు, ఆయన్ని గుర్తుంచుకోవలసింది తెల్లోడ్ని వెళ్లగొట్టాడని కాదు, ఆయన్ని గుర్తుంచుకోవాల్సింది మువ్వన్నెల జెండాల కోసం కాదు, ఆయన్ని గుర్తుంచుకోవాల్సింది కొల్లాయి కట్టాడని కాదు, ఆయన గోవును ప్రేమించాడని కాదు, ఆయన మాంసం ముట్టలేదని కాదు.. గాంధీజీని గుర్తుంచుకోవాల్సింది– అహర్నిశం, అనుక్షణం, కణం కణం తహతహలాడి చేసిన ఒక జాతి నిర్మాణం కోసం, మానవాళి ఔన్నత్యం కోసం, మనిషి ఎదగడం కోసం.




అది అర్థమైతే యువత గాంధీని వదలరు. అది అర్థం కాకుంటే, మనం ఎన్ని మాటలు చెప్పినా ఇది ముసలివాళ్ల ప్రేలాపనగా ఉంటుందికానీ.. గాంధీజీ జీవితానికి, వచ్చే తరం భవిష్యత్తుకి మధ్య సంబంధం ఉండదు. అందుకే నేను కర్కశంగా ఈ మాటలు చెప్పాను.

ఎందుకంటే గాంధీజీని వ్యక్తిగా చూడబోకండి. గాంధీ కులమేంటో, ఎక్కడ పుట్టాడో మనకనవసరం. ఆయన ఏమి తిన్నాడో మనకనవసరం. ఏం చేశాడో కూడా పెద్ద ముఖ్యం కాదు. కాకపోతే ఆయన చేసిందంతా కూడా ఆయనే చెప్పాడు. నా జీవితమే నా సందేశమని. మనసావాచాకర్మణా ఆలోచనకి, మాటకి, చేతకి మధ్య తేడా లేకుండా దైవత్వాన్ని దాదాపుగా సంతరించుకున్నారాయన. అందుకోసం ఆదర్శం ఆయన. గాంధీజీ విలువలు, ఆయన నమ్మిన నమ్మకాలు మనకి పనికివచ్చే నమ్మకాలు. భవిష్యత్తుని, ప్రపంచమంతా, ముఖ్యంగా మనదేశంలో మనం తలుచుకుంటే ప్రభావితం చేస్తాయి. మన బిడ్డల బతుకులు సార్థకం చేస్తాయి. అందుకోసం ఈవేళ ఈ శ్రీకాకుళం పట్టణంలో రామ్మోహన్ చెప్పినట్టుగా ప్రారంభమైన ఈ ఉద్యమం, ఈ నిజమైన ఉద్యమం, మన భావ విప్లవం.. పెదాల్లో నుంచి కాకుండా, మొక్కుబడిగా కాకుండా, ఈ దేశంలో మామూలుగా మనం చేసే రీతిలో కాకుండా, చిత్తశుద్ధితో గుండె లోతుల్లోకి వెళుతుందని, తరువాత తరానికి దాని ప్రయోజనం అందుతుందని మనసారా ఆశిస్తున్నాను. ఇంతటి మండుటెండలో మీరంతా ఎలా ఉన్నారో నాకు అర్థం కాదు. నాకు చెమట్లు కారిపోతున్నాయి. నీళ్లు తాగకపోతే నాలుక పిడచకట్టిపోతోంది, శోష వస్తోంది. ఇంతమంది ఇంత శ్రమకోర్చి ఒక అద్భుతమైన భావానికి కట్టుబడి ఇంతసేపు కూర్చున్నారు. మీ అందరినీ మరోసారి మనసారా అభినందిస్తూ.. ఈ పోరాటం దేశంలో నిజమైన స్వావలంబన సామాన్యునికి దక్కేలాగా, ప్రతి మనిషికీ స్వేచ్ఛ ఫలితాలు అందే దాకా, వివక్ష అంతరించే దాకా, వ్యక్తి హితము–సమాజ ఔన్నత్యమూ కలిసే వ్యవస్థ నిర్మాణం జరిగే దాకా ఈ పోరాటం కొనసాగాలని ఆకాంక్షిస్తూ, మీ అందరికీ నమస్కరిస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను. ■


జైహింద్!

# నగరీకరణ: అభివృద్ధి విధానాల్లో 'స్థానికతకు పెద్దపీటే' చైనా సక్సెస్ మంత్రం!

- యుజెనీ ఎల్.బిర్చ్,
షహనా చట్టరాజ్,
సుసాన్ ఎం.వాచ్టర్

**చైనా కేంద్రీకృత రాజ్యమైనా అభివృద్ధి విధానాల్లో స్థానికతకు పెద్దపీట వేసింది. నగరాల అభివృద్ధి, వికాసాలకు కావలసిన నిధులు, విధాన రూపకల్పనలో స్థానిక ప్రభుత్వాలదే నిర్ణాయక పాత్ర. కానీ భారతదేశం సమాఖ్య (ఫెడరల్) రూపం కలిగినదైనా స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి విధానాలు, నిధులు కేటాయింపులు చేసే పరిస్థితి లేదు. చైనాలో నగరాలు, వాటి పాలక ప్రభుత్వాలు స్థానికతకు పెద్దపీట వేసి అన్నింట్లో అభివృద్ధికి మార్గం వేస్తున్నాయి. కానీ భారత్‌లో స్థానిక ప్రభుత్వాలకు అభివృద్ధి విధానాలు, నిధులు కేటాయింపులు చేసుకునే శక్తి, విధివిధానాలు లేవు. దీంతో అభివృద్ధి, నగరీకరణ చైనాతో పోలిస్తే కుంటినడకన సాగుతున్నది. చైనాలో 50 శాతం ప్రభుత్వ ఖర్చులు, 25 శాతం రెవెన్యూ ఆదాయం స్థానిక ప్రభుత్వాల చేతిలో ఉంటుంది. కానీ భారత్‌లో ఆ శాతాలు బాగా తక్కువ. కేంద్రీకృత ఆర్థిక, పాలనా విధానాల కారణంగానే భారత్‌లో నగరీకరణ అనుకున్నస్థాయిలో, దిశలో సాగటం లేదని తేటతెల్లం అవుతున్నది.**

చైనా, భారత్‌ల మధ్య చాలా సందర్భాల్లో పోలిక వస్తూ ఉంటుంది. అభివృద్ధి విషయంలోనూ ఇది తప్పనిసరిగా అనేక సందర్భాల్లో వస్తున్నది. నగరీకరణ, నగరాభివృద్ధి, మౌలిక వనరుల ఏర్పాటు విషయంలోనూ చైనా, భారత్‌ల మధ్య పోలిక అనివార్యంగా చర్చకు వస్తున్నది. ఆ క్రమంలో చూస్తే.. 1990లో దాదాపుగా ఇండియా, చైనాల ఆర్థిక వ్యవస్థల తీరుతెన్నులు సరిసమానంగా ఉన్నాయి. ఇప్పటి పరిస్థితి చూస్తే.. చైనాతో పోలిస్తే భారత్ మరుగుజ్జు అయిపోయింది. ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నగరీకరణ అభివృద్ధిలో చైనా భారత్‌కు అందనంత ఎత్తుకు వెళ్లిపోయింది. ఇండియాలో నగరాలన్నీ సమస్యలకు నిలయాలుగా, చుట్టూ మురికివాడలతో చుట్టిముట్టి ఉన్నాయి. విద్యుత్తు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య లోపంతో పాటు నివాసాలకు చట్టపరమైన గుర్తింపు లేకుండా అస్తవ్యస్తంగా ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని నగరాల తీరుకు ప్రతీకగా మన నగరాల స్థితి ఉన్నది. ఇదంతా క్రమరహిత అభివృద్ధి ఫలితంగా ఏర్పడిన పరిస్థితులని చెప్పుకోవచ్చు. కానీ చైనా విషయానికి వస్తే.. నగరాలన్నీ క్రమబద్ధమైన అభివృద్ధి విధానంతో మౌలిక వసతుల కల్పనతో అభివృద్ధికి సంకేతంగా నిలుస్తున్నాయి. దీనికి చైనాలో నగరాల అభివృద్ధికి పెద్దమొత్తంలో కేటాయించిన నిధులే కారణం.




చైనా, భారత్ రెండు దేశాల్లోనూ గత దశాబ్దాల్లో క్రమానుగతమైన సుస్థిర నగరీకరణ జరిగింది. కానీ చైనాతో పోలిస్తే నగరాభివృద్ధిలో భారత్ చాలా వెనుకబడి ఉన్నది. 1980లో చూస్తే చైనాలో నగర జనాభా 20 శాతం. అదే భారత్‌లో నాడు నగర జనాభా 25 శాతం ఉండేది. 2010 నాటికి నగర జనాభా చైనాలో 50 శాతానికి చేరుకోగా, ఇండియాలో మాత్రం 30 శాతంలోనే ఉండిపోయింది. ఈ విధమైన నగరీకరణ, అభివృద్ధి ఫలితంగా చైనాలో నగర జనాభా 450 మిలియన్లు దాటింది. కానీ అదే భారత్‌లో మాత్రం నగర జనాభా 200 మిలియన్లు దాటలేదు. దీంతో చైనాలో నగరీకరణ ఏ స్థాయిలో జరిగిందో తేటతెల్లం అవుతున్నది. ఈ నేపథ్యంలోనే చూస్తే.. 1980–2010 మధ్య భారతదేశ

స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) ఐదు రెట్లు పెరిగితే, చైనా జీడీపీ 30 రెట్లు పెరిగింది. అలాగే దేశీయ తలసరి జీడీపీ కూడా 300 డాలర్లకు పెరిగింది. కానీ 2010 నాటికి భారత్ తలసరి జీడీపీ 1,500 డాలర్లకు చేరుకుంటే, చైనా తలసరి జీడీపీ 4,500లకు చేరుకున్నది. దీన్నిబట్టి తెలుస్తున్నదేమంటే, చైనాలో నగరాల అభివృద్ధి ఒక క్రమబద్ధమైన విధానంతో ముందుకు సాగింది. కానీ భారత్‌లో ఇలాంటి క్రమబద్ధమైన సుస్థిరాభివృద్ధి విధానం కొనసాగలేదు. ఇదే భారత్, చైనాల మధ్య అభివృద్ధి అంతరానికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

ఆర్థికాభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు మధ్య ఉన్న సంబంధం తెలియనిది కాదు. నిజానికివి వేర్వేరు కాదు. గతంలోకి చూస్తే ప్రఖ్యాత ఆర్థికవేత్త ఆడమ్ స్మిత్ ప్రకారం, రవాణా సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తాయి. వీటితోనే వ్యాపారం, వస్తూత్పత్తి పెరుగుతుంది. మౌలిక వసతుల కల్పనతోనే జీడీపీ కూడా వృద్ధి చెందుతుంది. ఈ విధమైన మౌలిక వనరులు, వసతులతోనే సుస్థిరాభివృద్ధి సాధ్యమై ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. నగరీకరణ జరుగుతుంది. నగరీకరణ, స్థానిక పారిశ్రామికీకరణతోనే నిర్దిష్ట ప్రాంతంలో అభివృద్ధి వేగం పుంజుకొని నగరీకరణ పరుగులు తీస్తుంది. ఈ విధమైన నగరీకరణ, పారిశ్రామికీకరణ, కమ్యూనికేషన్ వ్యవస్థల అభివృద్ధితోనే సుస్థిర నగరీకరణ సాధ్యమవుతుంది.

చైనాలో 1988 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు నగరాల్లో ఉపాధి కల్పించి అభివృద్ధికి పెద్దపీట వేయటంతో నగరీకరణ వాయువేగంతో దూసుకుపోయింది. ఈ క్రమంలోనే నగరీకరణ ఏ రీతిన వేగం పుంజుకున్నదో అదే రీతిన మౌలిక వనరుల కల్పనకు కూడా చైనా ప్రభుత్వం పెద్దపీట వేసింది. దీంతో చైనాలో వ్యక్తిగత తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెరిగి, పేదరికం కూడా రికార్డుస్థాయిలో తగ్గిపోయింది. ఈ నేపథ్యంలోంచే చైనా సుస్థిరాభివృద్ధి చెందటంతోపాటు, సాంఘికాభివృద్ధి కూడా సాధ్యమైంది.

చైనాలో నగరీకరణ ఓపెన్‌సిటీ విధానంలో నగరాలన్నీ చాలా వేగంగా అభివృద్ధి చెందాయి. స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి విధానాలను రూపొందించే విధానం చైనాలో ఉన్నది. ఈ విధానంతోనే చైనా నగరాలన్నీ సుస్థిరాభివృద్ధి దిశగా సకల సౌకర్యాలు, వనరులతో అభివృద్ధి చెందాయి. ఇది భారత్‌తో పోల్చుకుంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉన్నది. 1990లో పది లక్షల జనాభా కన్నా ఎక్కువ ఉన్న నగరాలు చైనాలో 34 ఉంటే, 2010 నాటికి 93కు చేరింది. అదే భారత్‌లో 43 నగరాలు మాత్రమే పది లక్షల జనాభా కలిగిన నగరాలుగా అభివృద్ధి చెందాయి.

చైనా కేంద్రీకృత రాజ్యమైనా అభివృద్ధి విధానాల్లో స్థానికతకు పెద్దపీట వేసింది. నగరాల అభివృద్ధి, వికాసాలకు కావలసిన నిధులు, విధాన రూపకల్పనలో స్థానిక ప్రభుత్వాలదే నిర్ణాయక పాత్ర. కానీ భారతదేశం సమాఖ్య (ఫెడరల్) రూపం కలిగినదైనా స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి విధానాలు, నిధులు కేటాయింపులు చేసే పరిస్థితి లేదు. చైనాలో నగరాలు, వాటి పాలక ప్రభుత్వాలు స్థానికతకు పెద్దపీట వేసి అన్నింట్లో అభివృద్ధికి మార్గం వేస్తున్నాయి. కానీ భారత్‌లో ప్రతి విషయానికి కేంద్రం వైపు చూడాల్సిన పరిస్థితి ఉన్నది. స్థానిక ప్రభుత్వాలకు అభివృద్ధి విధానాలు, నిధులు కేటాయింపులు చేసుకునే శక్తి, విధివిధానాలు లేవు. దీంతో అభివృద్ధి, నగరీకరణ చైనాతో పోలిస్తే కుంటినడకన సాగుతున్నది. చైనాలో 50 శాతం ప్రభుత్వ ఖర్చులు, 25 శాతం రెవెన్యూ ఆదాయం స్థానిక ప్రభుత్వాల చేతిలో ఉంటుంది. కానీ భారత్‌లో ఆ శాతాలు బాగా తక్కువ. కేంద్రీకృత ఆర్థిక, పాలనా విధానాల కారణంగానే భారత్‌లో నగరీకరణ అనుకున్నస్థాయిలో, దిశలో సాగటం లేదని తేటతెల్లం అవుతున్నది.

స్థానిక పన్నుల వికేంద్రీకరణ, అభివృద్ధి విధానాల రూపకల్పనలో స్థానికతకు ప్రాధాన్యం, సేవల కల్పనలో చైనా అగ్రభాగాన నిలిచి అభివృద్ధికి మార్గం వేసింది. స్థానిక మునిసిపల్ పాలక విధానాలు కూడా స్వయంప్రతిపత్తితో వ్యవహరిస్తూ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాయి. ఈ క్రమంలోనే కేంద్రప్రభుత్వం కూడా ఇలాంటి స్థానికాభివృద్ధి విధానాలకు మద్దతుగా నిలిచి ప్రోత్సహించింది. ఈ క్రమంలోనే అభివృద్ధి కేంద్రాలుగా చెప్పుకునే షాంఘై, బీజింగ్ తరహా అన్ని నగరాలు అభివృద్ధి చెందాయి. ఈ నేపథ్యంలోనే అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా 6 శాతం జీడీపీతో చైనా దూసుకుపోయింది. మిగతా దేశాలేవీ మూడు, నాలుగు శాతానికి దాటలేదు. ఈ క్రమమంతా చూస్తే అనుసరించిన అభివృద్ధి విధానాలు, స్థానికతకు పెద్దపీట వేయటంలోనే చైనా అభివృద్ధి మంత్రమంతా ఉన్నదని తెలుస్తున్నది. ■

(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)




# 'ఆయుష్మాన్ భారత్'.. ఇప్పటికైతే ఎన్నికల స్కీమే!

- సత్యారాణి

**10** కోట్ల కుటుంబాలు లేదా 50 కోట్ల మంది ప్రజలకు, 1350 వ్యాధులకు వర్తించేలా మోదీ ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక 'ఆయుష్మాన్ భారత్' (ప్రధానమంత్రి జనారోగ్య అభియాన్) పథకంలో ఇన్సూరెన్స్ కీలకమైనది. బీమా ఆధారిత ఆరోగ్య సేవలను అందించటం తప్పుడు విధానం కాకపోయినా, భారత్‌కు సరైన పంథా కాదనేది బలమైన వాదన. ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా కూడా ఈ హేతుబద్ధ వాదనను నీతి ఆయోగ్ దృష్టికి తీసుకెళ్లింది (నీతి ఆయోగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సమర్పించిన 'అందరికీ ఆరోగ్యం' నమూనా విధానాన్ని **www.fdrindia.org** లో చదవొచ్చు).

సంఘటిత రంగం తక్కువగా ఉండి, జనాభాలో 90 శాతం దాకా అసంఘటిత రంగంలో ఉండే మనదేశానికి నూరుశాతం బీమా ఆధారిత వైద్యసేవలు ముందుందు పెనుభారంగా మారే అవకాశముంది. అంతకుముందున్న రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బీవై) పథకం ఫలితాలు కూడా ఈ వాదననే బలపరుస్తున్నాయి. ఆర్ఎస్‌బీవై ఉన్నా కూడా ఈ దేశంలో ఆరోగ్యం కోసం జేబులో నుంచి డబ్బులు వదిలించుకుని అప్పుల పాలవుతున్నవారి సంఖ్య తగ్గలేదు. 86 శాతం గ్రామీణులు, 82 శాతం పట్టణ జనాభాకు చికిత్సల్లో ఎటువంటి ఆర్థిక తోడ్పాటూ అందలేదని అధ్యయనాలు చెబుతున్నాయి. మరోవైపు, అప్పటి దాకా పేదలు కాకుండా ఉండి.. పెద్ద అనారోగ్యం, వైద్య రంగంలో సేవాభావం తగ్గిపోయి ఫక్తు వ్యాపార ధోరణులు పెరిగిపోతుండటం వల్ల కొన్ని సందర్భాల్లో సాధారణ జ్వరాల వల్ల కూడా అప్పులపాలై చివరకు పేదలుగా మారుతున్నవారి సంఖ్య భారత్‌లో ఏటా 5 కోట్లకు పైగానే ఉంది. జాతీయ నమూనా సర్వే నివేదిక ప్రకారం 72 శాతం గ్రామీణులు, 79 శాతం పట్టణవాసులు ప్రైవేటు వైద్యమే చేయించుకుంటున్నారు. బీమాను రూ.5 లక్షలకు పెంచితే, ఈ సమస్య పరిష్కారమవు తుందను కోవటం కేవలం భ్రమే. ఆరోగ్యశ్రీని చూస్తే ఇంకొంత స్పష్టత వస్తుంది. ఆరోగ్యశ్రీ అనే బీమా ఆధారిత సేవను ఏదోక పేరుతో తెలుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. ఇందులో చికిత్సకు ధరలు స్వేచ్ఛామార్కెట్ కనుగుణంగా కాకుండా, ఆస్పత్రుల డిమాండ్ కనుగుణంగా తయార య్యాయి. హైదరాబాద్ ఆస్పత్రిలో సీటీ స్కాన్‌కు రూ.19,080 బిల్లు వేస్తుంటే, ఢిల్లీ ప్రైవేటు ఆస్పత్రిలో రూ.7,900గా ఉందని నిపుణులు లెక్కచెబుతున్నారు. ఈ పరిధిలో అవకతవకలు ఇంకో చిట్టా. ఈ రకంగా చివరికి బీమా సొమ్మును బిల్లుల చెల్లింపు కోసం ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు దుర్వినియోగం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఉదాహరణలు చెబుతున్నాయి. ఇంత ఖరీదైన వైద్యాన్ని అందిస్తున్నా, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలోని అత్యధిక ప్రజానీకానికి సరైన వైద్య ఆరోగ్య సేవలు అందటం లేదన్నది చేదు వాస్తవం. పేదల ఉత్పాదక సామర్థ్యాన్ని పరిరక్షిస్తూ పేదరికాన్ని తొలగించటం లో, దిగువ మధ్యతరగతి వారు పేదరికంలోకి జారిపోకుండా నిలువరించటంలో ఆరోగ్యశ్రీ ఫార్ములా విఫలమైంది. ఇప్పుడు ప్రధానమంత్రి ఆరోగ్య పథకం కూడా ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేయిస్తుందిగానీ ప్రజలకు ఆరోగ్యాన్ని అందించలేదు.

మరోవైపు, ఆయుష్మాన్ భారత్

పథకం గురించి ఎన్నో ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం కేవలం రూ.1200 కోట్లు కేటాయించింది. దీంతో.. వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసమే తప్ప నిజంగా ప్రజలకు ఆరోగ్యం అందించాలన్న దృష్టితో ఈ పథకాన్ని ప్రవేశపెట్టలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య స్థాయిలో 1,50,000 వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. కానీ వైద్య సిబ్బంది, నిపుణులైన ల్యాబ్ సిబ్బంది వంటి అంశాలనేమీ పట్టించుకోలేదు. ఉన్న వైద్యసిబ్బందిని ఉపయోగించుకుని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలనందించడానికి ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే విషయం మీద లోతుగా చర్చించలేదు. దీంతో, వైద్య ఆరోగ్య విధానంలో కీలకమైన 'ప్రాథమిక ఆరోగ్యంలో నాణ్యత' కేవలం కాగితాలకే పరిమితమైంది.

మన పొరుగునే ఉన్న చైనాలో కమ్యూనిస్టు నియంతృత్వమున్నా.. వైద్య రంగం పట్ల ఎంతో శ్రద్ధను కనబరచింది. జేబులో నుంచి ఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానానికి 1949లోనే శ్రీకారం చుట్టింది. 1984 వరకూ అదే విధానం కొనసాగినా, మనదేశంలో సోషలిస్టు భావజాలురమని చెప్పుకునే వాళ్లు, రాజ్యాంగ పీఠికలో సోషలిజాన్ని చేర్చామని జబ్బలు చరుచుకునేవాళ్లు, మావోను అనుసరిస్తున్నామని చెప్పుకుంటూ తుపాకులు పట్టుకుని తిరిగేవాళ్లు మాత్రం పట్టించుకోలేదు. విద్య, వైద్య రంగాల్ని నాశనం చేయటం ద్వారా మన దేశంలోని రాజకీయ నాయకులు ఎన్నో తరాలకు తీవ్ర నష్టం చేశారు. 1970ల చివర్లో ఆర్థిక సంస్కరణలను ప్రారంభించిన నేపథ్యంలో చైనా తన వైద్య ఆరోగ్య విధానంలో కొత్త పద్ధతుల్ని ప్రవేశపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవి ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదు. 1984లో, 2003లో, 2009లో దశలవారీగా ఆరోగ్య సంస్కరణలను ప్రవేశపెడుతూనే వచ్చింది. కానీ మనకంటే ఎంతో లోతైన ఆలోచనతో చైనీయులు ఆరోగ్య రంగాన్ని బాగు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవల కోసం 2009-10లో 42.2 బిలియన్ యువాన్లను చైనా ప్రభుత్వం పెట్టుబడి పెట్టింది. ఇది అంతకుముందు 30 ఏళ్లలో పెట్టిన మొత్తం పెట్టుబడి కంటే కూడా ఎక్కువ. గ్రామ స్థాయి నుంచి ప్రాథమిక వైద్యానికి పకడ్బందీ ఏర్పాట్లు, బలమైన స్థానిక ప్రభుత్వాల పర్యవేక్షణ, వికేంద్రీకరణ, సహకార ఆరోగ్య సేవలు, ప్రభుత్వ-ప్రైవేటు ఇన్సూరెన్స్, ఆరోగ్య సేవలు వంటి రకరకాల పద్ధతులను సమర్థవంతంగా మేళవించి అందరికీ ఆరోగ్యాన్ని అందించే ప్రయత్నం చేస్తోంది.

యువ జనాభా తగ్గిపోయి వృద్ధుల సంఖ్య పెరుగుతుండటం వంటి సవాళ్లను ఆరోగ్య రంగంలో ఎలా ఎదుర్కోవాలా అని చైనావాళ్లు మల్లగుల్లాలు పడుతుంటే.. మనదేశానికున్న యువజనాభా అడ్వాంటేజ్‌ను దూరదృష్టితో సద్వినియోగం చేసుకోవటానికి సరైన ఆరోగ్య విధానాన్ని అనుసరించాలన్న తపన మన ప్రభుత్వంలో కానరావడం లేదు. గత అనుభవాలను బేరీజు వేసుకోకుండా, సరైన చర్చ, లోతైన అవగాహన లేకుండా ఆయుష్మాన్ భారత్‌ను అమల్లోకి తెచ్చేశారు. ఆరోగ్య రంగంలో ఒక పెద్ద అడుగైతే వడింది కాబట్టి.. ఎన్నికలయ్యాకైనా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా (తక్కువ ఖర్చుతో అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా చెబుతున్నారు) దిద్దుబాటు జరుగుతుందని, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ ప్రాతిపదికన ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తారని, స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని ఇస్తారని, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఆరోగ్య వ్యవస్థను విస్తరించి నివారించదగ్గ బాధల నుంచి కోట్లాది మందికి పరిష్కారాల్ని అందిస్తారని ఆశిద్దాం. ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయాల్సిన పనులేమిటో స్పష్టంగా గుర్తించి, మేం కట్టే పన్నుల డబ్బును ఆ పనుల కోసం ఉపయోగించేవారికే మా ఓటు అని మనం స్పష్టంగా డిమాండ్ చేయగలిగినప్పుడే.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటివి సకాలంలో సాధించుకోగలం. ■

## జగన్‌పై దాడిని ఖండించిన జేపీ

వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో జరిగిన దాడిని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఓటు, భావప్రకటనా స్వేచ్ఛలతో పోరాడాలి తప్ప హింసకు తావులేదన్నారు. జగన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "రాజకీయాలంటే వ్యక్తుల సంఘర్షణ కాదు, భావజాలాల సంఘర్షణ! డబ్బు, వ్యక్తులు, విద్వేషాల చుట్టూ తిరుగుతున్న అధికార రాజకీయ క్రీడలో పావులు కాకుండా, మీ జీవితాల్ని బాగు చేసుకునే ఎజెండా మీద దృష్టి పెట్టండి" అని యువతకు జేపీ విజ్ఞప్తి చేశారు.

ఆర్థికవృద్ధి ముఖ్యమేగానీ సర్వస్వం కాదని.. కోట్లాది ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చటంతో పాటు వారికి ఎదిగే, హుందాగా బతికే అవకాశాలు కూడా ముఖ్యమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను పట్టించుకోకుండా ఆర్థిక వృద్ధి చుట్టూనే తిరిగితే సామాజిక, రాజకీయ కల్లోలం తప్పదన్నారు. ప్రజల న్యాయమైన అసంతృప్తిని ఎల్లకాలం అణగదొక్కలేరన్నారు. ఆర్థిక వృద్ధి, మానవ వనరుల అభివృద్ధి కలగలిస్తేనే భారతదేశ సుస్థిరాభివృద్ధి సాధ్యమన్నారు.




# విధానాల వైఫల్యమే భారతదేశ వైఫల్యం!

ప్రొఫెసర్ రాధాకృష్ణ గౌరవార్థం హైదరాబాద్‌లోని 'సెస్' (ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం)లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కార్యక్రమంలో జేపీ ప్రసంగించారు.

సుస్థిరాభివృద్ధి విషయంలో ఇప్పటివరకూ మనం ఎందుకు విఫలమయ్యామో ఆత్మపరిశీలన చేసుకోవాలని జేపీ అన్నారు. పరిస్థితుల ప్రభావమో, వనరులు లేకపోవటమో అందుకు కారణం కాదని.. మన విధానాల రూపకల్పనలోనే వైఫల్యం ఉందని అన్నారు. మన పబ్లిక్ పాలసీ విధానం అసమర్థంగా, ప్రతికూల ఫలితాలనిచ్చేదిగా, యధాతథ పరిస్థితిని కొనసాగించేదిగా ఉందన్నారు. "ఉదాహరణకి, అవినీతి విషయాన్నే తీసుకుందాం. మన దేశంలోని 65 శాతం కుటుంబాలు సాధారణ ప్రభుత్వ సేవల కోసం కూడా ఏటా లంచాలిస్తున్నారని పలు అధ్యయనాలు వెల్లడించాయి. దీనివల్ల పేదలు, బలహీనవర్గాలే ఎక్కువగా నష్టపోతారు. గతి లేక లంచం ఇవ్వాల్సిన పరిస్థితికి ఎక్కువగా బాధితులు వారే. దీనికి మన విధానపరమైన స్పందనేమిటో తెలుసా?.. 'గతి లేక, బలవంతంగా అంచం ఇచ్చే పౌరునికి 3 నుంచి 7 ఏళ్ల జైలుశిక్ష, లంచం తీసుకున్న ప్రభుత్వాధికారి మీద కేసు బుక్ చేయాలన్నా కూడా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి' అనే అసంబద్ధ నిబంధనలతో అవినీతి నిరోధక చట్టానికి సవరణలు చేశారు. ఇదీ విధానాల రూపకల్పన స్థాయి" అని జేపీ వివరించారు.

అలాగే ఈవేళ మనం మతిమాలిన విధానాల వల్ల ఆర్థికరంగంలో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామన్నారు. మన విధానపరమైన వైఫల్యంతో తలెత్తిన సంక్షోభం పలు రంగాలకు విస్తరించి తాండవిస్తోందని జేపీ అన్నారు. ఉదాహరణకు కీలకమైన విద్యారంగాన్నే తీసుకుంటే.. మన విద్యాప్రమాణాల దయనీయ స్థాయిని 'పీసా', 'అసర్' సర్వేలు సాక్ష్యాధారాలతో బైట పెట్టాయన్నారు. అలాగే ఆరోగ్య రంగంలో స్కీములు తప్ప ప్రజలకు ఆరోగ్యం అందటం లేదన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలు బిల్లుల రీఇంబర్స్‌మెంట్ మీద తప్ప, ఆరోగ్య ఫలితాల మీద దృష్టి పెట్టలేదన్నారు.

పాల్ రోమర్ చెప్పినట్టు "సంక్షోభం అనేది వృథాచేయకూడని ఓ భయంకరమైన పరిస్థితి" అని జేపీ అన్నారు. విద్యారంగంలో సక్సెస్‌కి కొత్త నిర్వచనాన్ని ఇస్తూ విద్యార్థి నేర్చుకున్న విద్యాప్రమాణాల చుట్టూ తిప్పాలన్నారు. 'పీసా' సర్వేలో నిర్దేశించిన ప్రమాణాలను మంచి పాఠశాల విద్యకు ప్రాతిపదికల్ని చేయాలన్నారు. దీనికేమీ ఇప్పుడు చేస్తున్న ఖర్చుకు పెద్ద అదనంగా నిధులు అవసరం లేదన్నారు. వోచర్ పద్ధతి ద్వారా నచ్చిన స్కూల్లో చదువుకునే అవకాశం ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విద్యార్థుల కంటే టీచర్లు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్ని హేతుబద్ధీకరించాలన్నారు. ఆరోగ్య రంగంలో యూకే పద్ధతిలో రెఫరల్ సిస్టంతో బలంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను భారతదేశ పరిస్థితులకనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు.

మన ప్రభుత్వాలు ఈవెంట్ మేనేజ్‌మెంట్లను, వీఐపీల స్వాగత సత్కార కార్యక్రమాల్ని, ఉచితాల పంపిణీల్ని నిర్వహించటంలో సాటిలేని సామర్థ్యాన్ని ప్రదర్శించగలుగుతున్నాయని, కానీ నిజమైన పాలన, ప్రజలకు నాణ్యమైన సేవల్ని అందించటంలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నాయని జేపీ అన్నారు.

ఈ వైఫల్యాల్ని సరిచేయాలంటే.. ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్దిష్ట గడువులోగా ప్రతి పనినీ ప్రజలకు చేసిపెట్టేలా, చెప్పిన టైంలోగా చేయలేకపోత పరిహారం చెల్లించేలా 'పౌర సేవల' చట్టాన్ని తీసుకురావాలని, అధికారాన్ని వికేంద్రీకరించి జవాబుదారీతనాన్ని పెంచాలని జేపీ అన్నారు.

"ఓటుకు – తమకు ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలకు మధ్య ఉన్న సంబంధం ప్రజలకు అర్థం కావాలి. అధికారాన్ని జవాబుదారీతనంతో వికేంద్రీకరిస్తేనే పాలనలో సక్సెస్ సాధ్యమవుతుంది. మన దేశంలో ఫెడరలిజం బలపడుతోంది కానీ, అనేక రాజ్యాంగపరమైన, వ్యవస్థాగతమైన అవరోధాల వల్ల పాలన మెరుగుపడటం లేదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టవుతోంది. సరైన విధానాలు, అమలు కోసం నిధుల్ని వెచ్చిస్తేనే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుంది" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ■

# కుల, ధన రాజకీయాలు మనకొద్దు!

**- ఎ.అన్నపూర్ణ, కాలిఫోర్నియా**

*నేను ఒకసారి దూరప్రయాణం చేస్తూ రైలులో నలుగురు వ్యక్తులను చూశాను. వారు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. వివరాలు మాట్లాడుకుంటూ తామంతా బంధువులమేనని తెలుసుకున్నారు. అదెలా అంటే, వివిధ కులమతాల వివాహాలు చేసుకోవడం వల్ల బంధుత్వం కలిసిందన్నమాట. అందరూ హైదరాబాద్‌వారే కావడంతో తరచుగా కలుసుకుందామని ఫోన్ నెంబర్లు ఇచ్చుకున్నారు. ఇదంతా చూస్తుంటే ముచ్చటగా అనిపించింది. ఆ తర్వాత వారందర్నీ అనుకోకుండా కలిశాను. మీతోపాటు నేను కూడా ప్రయాణం చేశాను, గుర్తుపట్టారా అని అడిగాను. వాళ్లు గుర్తుపట్టారు. వారంతా టైమ్‌పాస్‌కి కబుర్లు చెప్పుకోవడం కాకుండా, మాట నిలబెట్టుకోవడం సంతోషం కలిగించింది. సలీమ్ అనే రచయిత బ్రాహ్మణ యువతిని వివాహం చేసుకున్నారు. వారు అన్యోన్యంగా సంతోషంగా ఉన్నారు.*

అన్నిటికీ మూలమన్నట్టు ధనం, కులం తయారవటంతో.. వీటితోనే ప్రజలను మోసగించాలని చూస్తున్నాయి మన రాజకీయ పార్టీలు. నిజానికి సంప్రదాయ పార్టీలు ఏ కులాన్నీ బాగు చేయవని, ఎన్నికల్లో గెలవటానికి మాత్రమే వాటిని అడ్డంపెట్టుకుంటున్నాయని ప్రజల్లో చాలామందికి సూచనప్రాయంగా తెలుసు. 'మనమంతా ఒక దేశ పౌరులం. పన్నులు కడుతున్నాం కనుక సౌకర్యాలు కల్పించడం పాలకులుగా మీ బాధ్యత. మమ్మల్ని ఉద్ధరిస్తున్నట్టు, మీ సొంత డబ్బేదో ఖర్చు చేస్తున్నట్టు కబుర్లు చెప్పకండి' అని కాస్త ఆలోచన కలిగినవారు మనసులో అనుకుంటూనే ఉన్నారు. అయినా సంప్రదాయ రాజకీయ దోపిడీని అడ్డుకోలేకపోతున్నారు.




వ్యవసాయంతో మానవుడు ఆటవిక స్థాయి నుంచి బైటపడి నాగరికత నేర్చుకున్నాడు. నియమనిబంధనలు, కట్టుబాట్లు ఏర్పరచుకున్నాడు. వృత్తివిద్యలు నేర్చి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాడు. సమాజాన్ని ఏర్పాటు చేశాడు. వీరంతా ఒకరికొకరు ఉపయోగపడేవారే! వంటపాత్రలుగా కుండలు తయారుచేయడం, కాళ్లకు రక్షణగా వేసుకోవడానికి చెప్పులు తయారుచేయడం, ఇంటిని నిర్మించుకోవడానికి మట్టితో గోడలు కట్టడం, ఇంటిపై కప్పులకు, నిద్రపోవడానికి, మరుగుకు తాటాకును ఉపయోగించడం, చాపలు, తలుపులు తయారుచేయడం, ప్రార్థనా స్థలాలను నిర్మించి పూజారులను నియమించడం, పంటల దిగుబడులను పెంచేందుకు కొత్త ఆలోచనలు చేయడం, గొడ్లు మేకలు పెంచడం.. ఇలా మెరుగైన జీవితానికి అవకాశాల్ని పెంచుకున్నాడు. క్రమంగా విద్యను అభ్యాసం చేస్తూ యంత్రాలతో పనులు చేయడం కనిపెట్టాడు. మానవ మేధకు పదునుపెట్టి సమర్థతను, అవకాశాల్ని విస్తృతం చేసుకున్నాడు. అన్ని రకాల జాతులతో సమాజాన్ని సుసంపన్నం చేసుకున్నాడు. అలా ప్రారంభమైన నాగరికత సర్వమానవ సౌభ్రాతృత్వంతో విలువలను నిలబెట్టుకోవలసింది పోయి.. ఆ లక్ష్యాల కోసమే ప్రారంభించుకున్న రాజ్యాధికారం అనే మార్గంలో చిక్కుకుపోయి, అధికారం కోసం అక్రమంగా డబ్బు కూడబెట్టడం, ఇతరుల్ని అణగదొక్కడం, విద్వేషాల్ని పెంచడం వంటి వాటికి పాల్పడే స్థాయికి దిగజారుతోంది. ఇరుగుపొరుగు, సమైక్యత, స్నేహభావం, పరోపకారం అనే అంశాలను మనుషులు మరచిపోతున్నారు. అగ్ర-అధమ అంటూ వర్ణ వర్గ కుల మత భావాలను ఇంకా ఘనీభవింపచేసుకుంటున్నారు. చదువు, సమైక్యతతో ప్రగతిని సాధించే విధానాలకు తిలోదకాలిస్తున్నారు. ఈ ధోరణులకు ఎదురీది కాలక్రమంలో కొందరు కొన్ని మార్పులను తీసుకొచ్చినా, పేదరికం, అవిద్య నిండా ఉన్న ఒక సువిశాల సంక్లిష్ట

దేశంలోని రాజకీయ చదరంగంలో అలాంటివారు వేగంగా ఫలితాల్ని సాధించలేకపోయారు.

యువతరంలో కొంతమందైనా కులాంతర వివాహాలు చేసుకుని కొంతవరకూ అన్ని వర్గాల మధ్య సామరస్య వాతావరణాన్ని కల్పించేందుకు తమ వంతు ప్రయత్నం చేశారు.

నేను ఒకసారి దూరప్రయాణం చేస్తూ రైలులో నలుగురు వ్యక్తులను చూశాను. వారు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. వివరాలు మాట్లాడుకుంటూ తామంతా బంధువులమేనని తెలుసుకున్నారు. అదెలా అంటే, వివిధ కులమతాల వివాహాలు చేసుకోవడం వల్ల బంధుత్వం కలిసిందన్నమాట. అందరూ హైదరాబాద్‌వారే కావడంతో తరచుగా కలుసుకుందామని ఫోన్ నెంబర్లు ఇచ్చుకున్నారు. ఇదంతా చూస్తుంటే ముచ్చటగా అనిపించింది. ఆ తర్వాత వారందర్నీ అనుకోకుండా కలిశాను. మీతోపాటు నేను కూడా ప్రయాణం చేశాను, గుర్తుపట్టారా అని అడిగాను. వాళ్లు గుర్తుపట్టారు. వారంతా టైమ్‌పాస్‌కి కబుర్లు చెప్పుకోవడం కాకుండా, మాట నిలబెట్టుకోవడం సంతోషం కలిగించింది. సలీమ్ అనే రచయిత బ్రాహ్మణ యువతిని వివాహం చేసుకున్నారు. వారు అన్యోన్యంగా సంతోషంగా ఉన్నారు.

ఇంకో సంగతి. నాకు జర్నలిస్టు ఫ్రెండ్స్ నలుగురున్నారు. ఒకరోజు ఒక ఫ్రెండ్ ఇంటికి వెళ్లాను. ఆవిడ అంతకు ముందు ఆకాశవాణిలో వ్యాఖ్యాతగా పనిచేశారు. ఆ పరిచయంతో తోటి ఉద్యోగి అయిన ఒక ముస్లిం తన కుమార్తె వివాహానికి ఆహ్వానించాలని వచ్చారు. మిత్రురాలు నన్ను పరిచయం చేసింది. ఆయన నాకు కూడా వెడ్డింగ్ కార్డు ఇచ్చి తప్పకుండా రావాలని చెప్పారు. పెళ్లి రోజున నా ఫ్రెండ్ తనతో తీసుకెళ్లింది. పెళ్లి ఆర్యసమాజ్ పద్ధతిలో చాలా సింపుల్‌గా జరిగింది. విందు భోజనం చేసి ఇంటి వస్తుంటే చెప్పింది మిత్రురాలు ఆ కుటుంబం గురించి. పెళ్లికి పిలిచిన సోదరుడు డైవోర్సీ. ఇద్దరు పిల్లల తల్లిని వివాహం చేసుకున్నారు. ఆయనకు మొదటి వివాహం. ఆవిడ కూతుళ్లకు ఈయనే వివాహం చేశారు. ఈయనకు ఇద్దరు అమ్మాయిలు. మొదటి అల్లుడు మణిపురి అబ్బాయి. ఇప్పుడు మనం వెళ్లిన పెళ్లి రెండో అమ్మాయిది. ఇతను పంజాబీ. మిత్రుడు ఎంతటి ఆదర్శవంతుడో చూపించడానికే నిన్ను తీసుకెళ్లాను.. అంటూ వివరాలు చెప్పింది. ఆ కుటుంబం నాలుగు కులాల సంగమం. నాకెంతో ముచ్చటగా తోచింది (వారి అనుమతి లేకుండా ముస్లిం కుటుంబం వివరాలు చెప్పకూడదని భావిస్తున్నాను). మాటల్లో ఆదర్శాలు వల్లించేవారు చాలామంది ఉంటారు. కానీ ఆచరణలో చూపించడం రియల్లీ గ్రేట్! ఈ ముస్లిం కుటుంబం లోక్‌సత్తా జేపీకి కూడా తెలిసినవారే.

కులం, మతం వంటి వాటిని అధిగమించడానికి మహాత్మాగాంధీ స్ఫూర్తితో కృషి చేసిన పలువురి గురించి విన్నాం. నెహ్రూ కుటుంబంలోనూ ఆ తీరును చూశాం. ఇంతకుముందే చెప్పుకున్నట్టు.. ఈవేళ కూడా అలాంటి చొరవ చూపుతున్న వారిలో కొందరి గురించి తెలుసుకుంటుంటే, మన చుట్టూ ఉన్న సామాన్యుల్లో ఎంత గొప్ప భావాలున్న వారున్నారోనన్న కనువిప్పు కలుగుతుంది.

పెళ్లి చేసుకోవడం దగ్గర కులప్రస్తావన కొత్తతరంలో ఉన్నకొద్దీ తగ్గుముఖం పడుతుండడం సంతోషించదగ్గ విషయం. తెలుగునాట గత పదేళ్లతో పోలిస్తే కులాంతర వివాహాల సంఖ్య మూడు రెట్లు పెరిగినట్టు పెళ్లిసంబంధాలు కుదిర్చే ఒక సంస్థ మీడియా ద్వారా తెలియజేసింది. ప్రతి వంద పెళ్లిళ్లలో ఎనిమిది కులాంతర వివాహాలు జరుగుతున్నట్టు ఆ సంస్థ తాజా పరిశీలనలో వెల్లడైంది. కులాంతర వివాహాల్లో ఎస్సీల సంఖ్య అధికంగా ఉంటోందని తెలిపింది.

కానీ మనం స్వతంత్రం వచ్చిన తరుణంలో, రాజ్యాంగంలో చెప్పుకొన్న గొప్ప సంకల్పాలను నెరవేర్చుకునేందుకు కావలసిన వ్యవస్థలను దూరదృష్టితో ఆలోచించి నిర్మించుకోకపోవటం వల్ల ముఖ్యంగా కులవ్యవస్థ ఈ దేశాన్ని ఇంకా బలంగా పీడిస్తూనే ఉంది.కకులాంతర వివాహాలపై దాష్టీకాలూ కొనసాగుతున్నాయి. పరిణామ క్రమంలోని ఒకానొక దశలో జీవనానికి ఒక ప్రత్యేకతను ఆపాదించిన వృత్తులు ఈరోజు కులం పేరుతో విద్వేషాలు పెంచడానికి ఎన్నికల రాజకీయాలు ఆజ్యం పోస్తున్నాయి.

పేదరికాన్ని అలుసుగా తీసుకుని డబ్బు, మద్యం, కడుపునిండా బిర్యానీ, మరోటీ ఆశ చూపించే నాయకులు ఏ కులం వారికీ న్యాయం చేయలేరు. అవకాశాలు అందరికీ రావాలంటే, కుల పిచ్చి నుంచి బైటికి రావాలి. అవినీతికి పాల్పడ్డవారు సొంత కులం వారైనా, అగ్ర కులం వారైనా, రిజర్వేషన్ కులం వారైనా సరే వారిని పట్టించేందుకు పౌరుల్లా మనలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. ప్రజల అవకాశాలను దెబ్బతీసే అవినీతిని తుదముట్టించడంలో నా వరకూ నా బాధ్యత నెరవేర్చాను.. అనే సంతృప్తి ప్రతి ఒక్కరిలోనూ ఉండాలి. ఇక్కడ అమెరికాలో నాకు తెలిసిన అమెరికన్ లేడీ లాయర్ ఉన్నారు. ఒకసారి అవకాశం వచ్చినప్పుడు అడిగాను. ట్యాక్స్ కట్టనివారికి పనిష్మెంట్ ఏమిటని! కఠిన కారాగారం, కట్టవలసిన పన్నుకు మూడు రెట్లు ఫైన్ చెల్లించడం అని చెప్పారు. మరో ప్రశ్న అడిగితే నేను ఫీజు చెల్లించాలి. అది గంట కావచ్చు, ఆ లోపు సమయమే

కావచ్చు. కనుక ఆ ఒక్క ప్రశ్న మాత్రమే అడిగాను. మనవద్ద పన్నులను హేతుబద్ధంగా నిర్ణయించడం, పన్నులకు తగ్గ సేవలను అందించడం కూడా చేతగాని పాలన సాగుతున్నా సరైనరీతిలో స్పందించలేకపోతున్నాం. ఏ విషయాన్ని, ఏ ప్రాతిపదికన అడగాలో అవగాహనను పెంచుకుని ఒక క్రమపద్ధతిలో ప్రయత్నించకుండా కేవలం భావోద్వేగాలతో రియాక్షన్లలా స్పందిస్తుండడంతో పెద్దగా ఫలితాల్ని సాధించలేకపోతున్నాం. పాలకులు మాత్రం వ్యక్తిగతంగా మనం ఊహించనంత లబ్ధిని పొందుతున్నారు, వాళ్ల వారసుల్ని రాచరికంలోలా మన నెత్తిన రుద్దుతున్నారు.

**పెట్రో ధరల ఉదాహరణ**

పెట్రోల్ ధరల విషయమే తీసుకోండి. పెట్రో ధరల పెరుగుదలపై ప్రతిపక్షాలు, సమాజంలోని పలు సంస్థలు కేంద్రం మీద విరుచుకుపడ్డాయి. టెలివిజన్ ఛానెళ్లలో చర్చాకార్యక్రమాలు హోరెత్తాయి. పెట్రోలు కావాలంటే ఇక మీదట చిల్లర కాదు, పెద్ద నోట్లు మాత్రమే దగ్గరుంచుకోవాలి, పేమెంట్ కార్డులుండాలి వంటి డైలాగ్‌లు పేలాయి. ధరల పెంపు అనే తక్షణ సమస్యను పట్టించుకున్నంతగా.. పెట్రో పీపా ధర తగ్గడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చింది, మన బడ్జెట్ ద్వారా ఆ డబ్బు ఎందుకు సద్వినియోగం కావడం లేదు, ప్రజారవాణా వ్యవస్థను, మౌలిక సదుపాయాలను మెరుగుపరచకుండా సొంత వాహనాల కొనుగోలును ఇబ్బడిముబ్బడిగా ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుండడం వల్ల ఇంధన వినియోగం పెరిగిపోతూ దేశానికి, పర్యావరణానికి ఎంత నష్టం వస్తోంది? వంటి కీలక ప్రశ్నల్ని మనం పట్టించుకోలేకపోయాం. మనకు అసలైన ప్రశ్నల పట్టింపు లేకపోవడం వల్ల ఏ పార్టీ అధికారంలో ఉన్నా పాలకులు చాలా తేలిగ్గా తమ తప్పుల నుంచి తప్పించుకోగలుగుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే అంశం మీద ఆందోళనల్ని చేసినవారు, చేయించినవారు చివరికి సాధించినదేమీ లేదని తెలిసినా కూడా మనం మళ్లీ ఆ పాచిపోయిన ధోరణితోనే సమస్యల చుట్టూ తిరుగుతుండడం విచారకరం.

కారణాలేమైనా, వ్యాపారరంగంలో అంతర్జాతీయంగా ఇచ్చిపుచ్చుకోవడాలు డాలర్‌తో జరుగుతున్నాయి. చమురును అమ్మే దేశాలు ప్రపంచ అవసరాలకు డాలర్‌లో చెల్లింపులు చేయాలని పట్టుపడుతున్నాయి. రూపాయి ధర పడిపోయి డాలర్ పెరిగిపోయింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ ముందు మనం ఎంత! దశాబ్దాలుగా మన పాలనా నిర్వాకంతో ఈ పరిస్థితి దాపురించింది. అమెరికాకు వెళ్లి స్థిరపడాలన్న ఉత్సాహమే తప్ప, అమెరికా నుంచి నేర్చుకుని ఆ తరహాలో భారత్‌ను ఎందుకు అభివృద్ధి చేయలేమన్న పౌరుషం, ప్రయత్నం, సహనం మనకు అంతగా లేవు.

అమెరికాలో విశాలమైన నాలుగు లేన్లు, ఆరు లేన్ల రహదారులున్నాయి. ప్రతీ బిల్డింగ్‌కీ పార్కింగ్ లాట్స్ ఉన్నాయి. అయినా జనాభా పెరిగినందున, వలస ప్రజల తాకిడికి చోటు సరిపోవడం లేదు. అందువల్ల కార్ల వాడకం తగ్గించారు ప్రజలు. ప్రభుత్వ రవాణా వ్యవస్థను పెంచారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత బైక్‌లు, బస్సులు, ట్రాలీలు ఉపయోగిస్తున్నారు. కొత్తరకం బైక్‌లు వచ్చాయి. వీటిని రెంట్‌కిస్తారు. వాటిని వాడినవారు ఎక్కడైనా విడిచిపెట్టవచ్చు. లాకింగ్ సిస్టం, బుకింగ్ పే చేయడం అన్నీ ఆన్‌లైన్‌లోనే కనుక తేలిగ్గా, ఉపయోగకరంగా ఉంది. వీటిని మనదేశంలో మెట్రో స్టేషన్ల వద్ద ప్రవేశపెట్టినా ఇంకా అరకొరగానే అమలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని జనంలోకి బాగా అందుబాటులోకి తేవాలి. ప్రజలు డబ్బుకు అమ్ముడుపోతూ కులాల పట్ల పిచ్చితో ఉండాలనుకునే పాలకుల వల్లే మనదేశంలో ఇలాంటి మార్పులు ఆలస్యమవుతున్నాయి.

**రానున్న ఎన్నికల్లో..**

తెలుగునాట రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఉద్యోగస్తులు కొందరు అమరావతికి వెళ్లిపోయినా అంతకంటే ఎక్కువ సంఖ్యలోనే గ్రామాల నుంచిగానీ, బదిలీలు, వ్యాపారాల రీత్యాగానీ తెలంగాణకు వచ్చి చేరారు. సో.. జనాభా పెరిగింది. వీరంతా రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలంటే పేర్లు నమోదు చేసుకోవాలి. తెలంగాణలో ముందస్తు ఎన్నికల నేపథ్యంలో జనవరి 2018 తర్వాత ఓటర్లుగా నమోదయ్యేవారికి అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం లభించకపోవచ్చంటున్నారు. ఇది కొంత బాధాకరమే అయినా, ఓటుకు అర్హత ఉన్నవారిలో ఎక్కువమంది ఉత్సాహంతో నమోదు చేసుకుంటున్నారన్న వార్తలు ఉత్సాహాన్నిస్తున్నాయి. ముందు యువతలో ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదవ్వాలి. ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటును సరిచూసుకోవాలి. విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. 'నోటా' అనేది మంచి రాజకీయ ప్రజాస్వామ్యం కాకపోయినా.. ఏ ఒక్కరూ మెరుగైన అభ్యర్థి కాకుంటే ఆ ఆప్షన్‌ని ఉపయోగించుకోవటంలో తప్పు లేదు. ఏ పార్టీకి, ఏ అభ్యర్థికి ఓటు వేయాలో నిర్ణయించుకోవటమనేది ఇంతకుముందే అనుకున్నట్టు కులం, డబ్బు, మద్యం అనే అంశాల చుట్టూ కాకుండా మన జీవితాల్ని బాగు చేసే అంశాల చుట్టూ ఉండాలి. సబ్బులకు, పౌడర్లకు, పెట్రోలుకు, ఆదాయానికి, రాకపోకలకు మనం కట్టే ప్రతి రూపాయి పన్నునూ, మన

## యువత చైతన్యవంతులై ప్రజల అలవాట్లను మార్చాలి

ప్రజలు సంప్రదాయ రాజకీయ నేతల ఉచ్చులో పడకుండా కులానికి, అనుచిత డబ్బుకీ ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఎన్నికలు జరిగే ఒక్కరోజు ఇచ్చే డబ్బు కంటే, శాశ్వత ప్రయోజనాలను చేకూర్చే విధానాలను తెలుసుకోవాలి. ఎవరైనా డబ్బు ఇవ్వడానికి వస్తే లంగరాదు. కులమత భేదాలకు అతీతంగా యువత చైతన్యవంతులై ప్రజల అలవాట్లను మార్చాలి. మద్యానికి బానిసలైపోతున్న వారి బలహీనతలను రూపుమాపాలి. పిల్లలే తల్లిదండ్రులను హెచ్చరించాలి. మా ప్రయోజనాలు కావాలా? మద్యం, డబ్బు, తాయిలాలు కావాలా? అని తల్లిదండ్రులకు బుద్ధి చెప్పాలి. పిల్లలు బాగుపడినా చెడిపోయినా తల్లిదండ్రుల బాధ్యత ఎంతో ఉంటుంది. అలాంటిది తీర్చిదిద్దాల్సిన తల్లిదండ్రులే వ్యసనాల పాలైతే పిల్లలు మంచి వాతావరణంలో ఎదగలేరు. రాబోయే తరాలకు నాణ్యమైన చదువును అందించే ప్రయత్నం చేస్తూనే.. ఇప్పటికే సాధారణ చదువు పూర్తి చేసిన యువత అదనపు నైపుణ్యాలను పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడుతూ ఉపాధిని పొందాలి. కళాశాలల్లో పెద్ద చదువు లేకపోయినా, సామాజిక అవగాహన, కష్టపడే తత్వంతో తమను తాము మెరుగుపరచుకుని కొత్త ఆలోచనలతో ఉపాధి పొందుతున్నవారిని నా కళ్లారా చూశాను. బస్తీల్లోని యువత ఎంతటి శక్తిమంతులో, ఎంతటి దృఢసంకల్పం గలవారో! వారిని ప్రోత్సహించే మంచి నాయకత్వం, పాలన మనకు లభించేలా చూసుకోవాలి.

వనరులనూ సద్వినియోగం చేసేలా ఏ హామీలున్నాయో తర్కించుకుని, తరచి చూసి ఓటు వేయాలి. లేకపోతే మార్కెట్‌కి వెళ్లి పుచ్చు వంకాయలు తెచ్చే పరమానందయ్య శిష్యుల్లా మన బతుకు తయారవుతుంది. పరమానందయ్య శిష్యుల కథ కనీసం కామెడీ ఆఫ్ ఎర్రర్స్‌లాగా అన్నా ఉంటుంది, కానీ ప్రజాస్వామ్యంలో ప్రజలు చైతన్యం, ముందుచూపు లేకుండా చేసే పనులు ట్రాజిడీ ఆఫ్ ఎర్రర్స్‌లా మారి, మనల్ని, భావితరాల్ని కూడా దెబ్బతీస్తుంటాయి.

విషయాల్ని ఎలా తెలుసుకోవాలి, ఏ విషయం మీద ఏ ప్రమాణంతో నిర్ణయం తీసుకోవాలి అనేది మనం కొంత ఓపిగ్గా చేయాల్సిన పని. ఇక్కడ ఇంకో ఉదాహరణ చెబుతాను. నల్గొండ జిల్లా పేరు చెబితే ఫ్లోరోసిస్ బాధితులే గుర్తుకొస్తారు (ఈమధ్య కాలంలో నివారించదగ్గ యాక్సిడెంట్లు కూడా అనుకోండి). ఒక టీవీ ఛానెల్ వారు ఇటీవల అక్కడి ప్రజల్ని పిలిచి.. మీ సమస్యలు తీరాయా, ఫ్లోరోసిస్ రహిత నీటిని తాగుతున్నారా? వంటి ప్రశ్నల్ని అడిగారు. ప్రజలంతా 'నో' అని ముక్తకంఠంతో చెప్పారు. పాలకుల హామీలని, తాత్కాలిక ధోరణుల్ని, అవకాశవాదాన్ని ఎండగట్టారు. అదే టీవీ ఛానల్లో నాలుగు రోజుల తర్వాత కేటీఆర్ మాట్లాడుతూ, మంచినీటి సరఫరాను మెరుగుపరిచాం, ఆ నీటితో ఆడపడుచుల కాళ్లు కడుగుతున్నాం అని చెప్పుకొచ్చారు. ఏది నిజమో, ఎలా నిజమో ప్రజలకు వివరించాల్సిన ఆ టీవీ వాళ్లు నోరెత్తకుండా కేటీఆర్ చుట్టూ కెమెరాను తిప్పారు. ఏది నమ్మాలిప్పుడు? ఒకే వార్త, నిజం కూడా ఒకటే ఉంటుందక్కడ.. కానీ రోజుకో రకంగా వినిపిస్తోంది, కనిపిస్తోంది! ఇలాంటి అబద్ధాల, అర్ధసత్యాల ప్రచారయుగంలో ఉన్నామిప్పుడు. అందుకే వార్తల్ని కొంచెం లోతుగా, కాస్త విశ్వసనీయ వర్గాల నుంచి తెలుసుకునే ప్రయత్నం చేయాలి. మనం ఎంతగా నమ్మే వ్యక్తి నుంచయినా, నాయకుడి నుంచయినా గుడ్డిగా ముఖ్య సమాచారాన్ని నమ్మకూడదు. ఆ తర్వాత అభిప్రాయాల విషయంలో ఇంకా జాగ్రత్తగా ఉండాలి. లోక్‌సత్తా జేపీ చెప్పినట్టు.. తర్కబద్ధంగా, వాస్తవాలు, గణాంకాలు ఆధారంగా, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసేలా అభిప్రాయాల్ని ఏర్పరచుకోవాలి. ముఖ్యంగా మనం స్థానిక అంశాల పట్ల దృష్టి సారిస్తే, ఎక్కువగా ప్రచార మాయలో చిక్కుకోకుండా సరైన నిర్ణయాల్ని తీసుకోగలుగుతాం. అందుకే చుట్టూ ఉన్న సమస్యలపై అవగాహనతో సమాజం గురించి, రాజకీయం గురించి పట్టించుకోవటం మంచిది. ఓపికుంటే, క్రమంగా ఇతర ప్రాంతాల గురించీ పట్టించుకోవచ్చు. స్థానిక సమస్యల పట్ల అవగాహన, పరిష్కార శక్తి ఉన్నవారు జిల్లా, రాష్ట్ర, జాతీయ సమస్యలను కూడా మెరుగ్గా పరిష్కరించగలరనటంలో సందేహం లేదు. ప్రకాశం పంతులు, రాజేంద్రప్రసాద్, పటేల్, జలగం వెంగళరావు వంటి వారంతా స్థానిక స్థాయి నుంచే నాయకులుగా ఎదిగారు.

ఇప్పటి తరం పేర్లలో చాలా మార్పు వచ్చింది. పేరు చివర రెడ్డి, రాజు, చౌదరి, శాస్త్రి వగైరా పేర్లను పెద్దగా ఇష్టపడటం లేదు. ఇది మంచి పరిణామం. బిడ్డ పుట్టిన సమయంలోనే ఆస్పత్రిలో పేరు నమోదు చేసే రోజులు రావాలి. ఎన్నికల్లో కూడా కులాన్ని దాటి తమ నిజమైన ప్రయోజనాలను గట్టిగా పట్టించుకుని అడగటం మొదలుపెడితేనే, ఓటుకు-తమ ప్రయోజనాలకు ముడిపెట్టి బలహీనతలు లేకుండా డిమాండ్ చేయడం మొదలుపెడితేనే.. రాజకీయ నేతలు మారతారు,

మంచి ప్రభుత్వాలు వస్తాయి. మనం ఆలోచించినంత మాత్రాన, మాస్ జనం మారతారా? అనుకోవద్దు. మాస్ జనం మారలేదని కాస్త అవగాహన ఉన్నవారు కూడా మౌనప్రేక్షకుల్లా జడత్వంలో ఉంటే.. క్లాస్, మాస్ తేడా లేకుండా అందరూ నష్టపోతారు. ఎవరు ఎలా ఓటు వేసినా, మన వరకూ ఓటును సద్వినియోగం చేద్దామనుకుంటే.. కచ్చితంగా డబుల్ డిజిట్ ఓట్లు మంచి రాజకీయానికి పడతాయి. 10 శాతం పైన ఓట్లు నిలకడగా మంచి రాజకీయానికి వస్తుండటం చాలు, సంప్రదాయ రాజకీయ పార్టీల మెడలు వంచడానికి. అదీగాక, చాలామంది అనుకుంటున్నట్టు మాస్ జనమేమీ అమాయకులు కాదు. మంచి చేస్తే ప్రోత్సాహం ఉంటుందన్న భరోసా కలిగితే, వాళ్లు కూడా అద్భుతాల్ని సృష్టిస్తారు. అలాంటి భరోసానిచ్చే ఎన్నికల సంస్కరణల్ని కూడా తెచ్చుకోవాలి. వారసత్వ రాజకీయాల్ని, కుల, మత, ధన, తాయిలాల రాజకీయాల్ని నిర్వంద్వంగా తిరస్కరిస్తూ, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి నిజమైన అవసరాల మీద దృష్టి పెట్టి ఓటు వేస్తేనే సామాన్యులు తమ బతుకుల్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని మార్చగలరు, వాళ్లు కూడా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై దేశానికి దిశానిర్దేశం చేయగలరు. ■

## కలాం భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం






ఏపీజే అబ్దుల్ కలాం భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణమని, ఏ కులంలో, ఏ మతంలో, ఏ ప్రాంతంలో పుట్టినా యావత్ దేశానికే మెగా ఐకాన్‌గా నిలిచారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కలాంను కేవలం ఆరాధించటం కాకుండా.. ఆయన ప్రతిభను, పరిజ్ఞానాన్ని, సామాజిక నాయకత్వాన్ని యువత అలవర్చుకోవాలని సూచించారు. కలాం జన్మదినోత్సవం సందర్భంగా విజయనగరం జమ్మూ వద్దనున్న కలాం విగ్రహానికి పూలతో బాబ్జీ నివాళులర్పించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో జరిగిన కలాం జన్మదినోత్సవ వేడుకల్లో నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరమణబాబు, నేతలు హనుమప్ప, గంగప్ప, బాషా, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి నిరోధక చట్ట సవరణల్ని తొలగించాలి



అవినీతి నిరోధక చట్టానికి యూపీయే ప్రభుత్వం ప్రతిపాదించిన మతిలేని సవరణల్ని మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం యధాతథంగా పార్లమెంటులో ప్రవేశపెట్టిందని, దాన్ని అన్ని పార్టీలూ గుడ్డిగా సమర్థించాయని, ప్రజల్ని అణగదొక్కటం తప్ప అవినీతిని తగ్గించలేని ఈ సవరణల్ని వెంటనే వెనక్కుతీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆనందాచారి కర్నూలు జిల్లాలో డిమాండ్ చేశారు. గతిలేక లంచం ఇచ్చే ప్రజల్ని జైలులో పెట్టటం, అవినీతి అధికారులపై ఫిర్యాదుకు ముందస్తు అనుమతి ఉండాలనటం.. మెడ మీద తలకాయ ఉన్న వాళ్లు చేసే పాలన కాదని లోక్‌సత్తా జేపీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు, అన్ని పార్టీలకూ లేఖలు రాసినా కనీస విజ్ఞతను ఏ నేతా ప్రదర్శించలేదన్నారు. దీన్ని వెనక్కు తీసుకోకపోతే ముమ్ముందు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో లోక్‌సత్తా పత్తికొండ అధ్యక్ష ఉపాధ్యక్షులు జయరాముడు, ప్రసాద్, పార్టీ నేతలు శ్రీనివాసులు, ఎర్నిస్వామి, షరీఫ్, నాగరాజు, బాలప్ప, రామన్న, కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఎజెండాకు కొత్త చూపునివ్వాలి..
# వ్యవస్థను మార్చే ప్రజాఉద్యమాలు చేయాలని లోక్‌సత్తా నేతలకు జేపీ సూచన

రాష్ట్రంలో, దేశంలో రాజకీయాల వైఫల్యం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, వ్యవస్థను మార్చేలా, ప్రజలకు కొత్త చూపు, కొత్త దారి కనపడేలా ప్రజాఉద్యమాలకు తెలుగు రాష్ట్రాల్లో శ్రీకారం చుట్టాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పార్టీ నేతలకు సూచించారు. రాజకీయాల పేరుతో ప్రజల్లో వివక్షను, విభజనను పెంచి పోషిస్తున్నారని, ఇది భవిష్యత్ తరాలకి ఎంతో ప్రమాదకరని అన్నారు. దేశవ్యాప్తంగా రైతు తీవ్ర సంక్షోభంలో ఉన్నాడని, అధికారంలోకి ఎవరొచ్చినా రైతు జీవితం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కంటే ముందు.. ప్రజల ఉమ్మడి ఆకాంక్షలను, అవసరాలను లోక్‌సత్తా పార్టీ నినాదాలుగా మార్చాలని జేపీ కోరారు. హైదరాబాద్‌లో జరిగిన లోక్‌సత్తా పార్టీ తెలుగు రాష్ట్రాల కార్యవర్గ సమావేశంలో జేపీ మాట్లాడారు. వివరాల్ని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో మీడియాకు తెలియజేశారు. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి చెబుతున్నట్టు సామాజిక న్యాయం అంటే రాయితీలు, ఉచితాలు, తాత్కాలిక ఆకర్షణలు కాదని.. సామాజిక న్యాయం అంటే మౌలిక ఆదాయం, స్వతంత్ర జీవనం అని నేటి యువతకు తెలియజేస్తూ సమీకరించాలని జేపీ సూచించినట్టు ఆయన తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు తమ నిజమైన అవసరాలను డిమాండ్లుగా చేసుకునే విధంగా మున్ముందు ఉద్యమస్థాయిలో లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. విజయనగరం జిల్లాకి ప్రభుత్వ వైద్య కళాశాల అవసరాన్ని తెలియజేస్తూ పూర్తి స్థాయి నివేదికను





జేపీకి అందజేశామని, వివరాలు పరిశీలించి ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని హామీ ఇచ్చారన్నారు. విభజన హామీల అమలుపై స్వతంత్ర, జాతీయ స్థాయి నిపుణులతో లోక్‌సత్తా రూపొందించిన నివేదికపై కూడా విస్తృతంగా సమావేశాలు నిర్వహించాలని కార్యవర్గం నిర్ణయించిందన్నారు. లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రహ్మణ్యం, అధికార ప్రతినిధి ముదునూరి రాజ్‌వర్మ, పార్టీ సీనియర్ నాయకులు కటారి శ్రీనివాసరావు, శ్రీధర్, రమేష్‌రెడ్డి, ఐరామ్మూర్తి, గోవిందరావు, రాము, రవిమారుత్, రవీంద్ర, శ్రీమతి గజానని తదితరులు పాల్గొన్నారన్నారు. ■

# ఓటరు నమోదుకు పోస్టాఫీసుల్ని శాశ్వత కేంద్రాలుగా చేయాలి

లోక్‌సత్తా కృషి వల్ల దేశంలో ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులు తరచూ జరుగుతూ తప్పులు తగ్గాయని, వీటిని పూర్తిగా తగ్గించేందుకు తొలి నుంచి తాము సూచిస్తున్నట్టు పోస్టాఫీసుల్ని ఓటరు నమోదుకు శాశ్వత నోడల్ కేంద్రాలుగా చేయాలని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం అధ్యక్షుడు బి.వెంకటరమణబాబు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పురపాలక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ఆయన డిప్యూటీ తహసీల్దార్ బసవరాజుతో చర్చించారు. 1999లో 56 పోలింగ్ స్టేషన్ల పరిధిలో లోక్‌సత్తా ఓటరు జాబితాల సర్వే ప్రారంభించిందని, అప్పట్లో తప్పులు పట్టణ ప్రాంతాల్లో 44.8 శాతం నుంచి 15.9 శాతానికి తగ్గాయని వివరించారు. మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా ఇప్పటికీ రెండంకెల స్థాయిలో తప్పులు కొనసాగుతుండటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. లోక్‌సత్తా ఉద్యమం చేసిన అన్ని కార్యక్రమాల్లోనూ క్షేత్రస్థాయిలో ఎక్కువ సమయం తీసుకున్నది ఓటర్ల జాబితా ప్రక్షాళనేనని, ఎన్నికల సంఘం, అధికారులు.. సంచలనాలు, జీతాలు, పార్టీల మెప్పుకోసం కాకుండా సేవాభావంతో పనిచేసి ప్రజాస్వామ్యానికి కీలకమైన ఓటరు జాబితాల్ని పక్కాగా రూపొందించాలని కోరారు. ■

# పన్నుల తగ్గింపే పరిష్కారం



**2014**లో ముడిచమురు బ్యారెల్ ధర 112 డాలర్లుగా ఉన్నప్పుడు మన దేశంలో లీటరు పెట్రోల్ రూ.71, డీజిల్ రూ.57 లకు లభ్యమయ్యేవి. ఈవేళ బ్యారెల్ రేటు 82 డాలర్లుగా ఉన్నప్పటికీ పెట్రోల్ ధర రూ.90, డీజిల్ ధర రూ.80 దాటిపోతోంది. లీటరు ముడిచమురు దిగుమతి ధర రూ.26 ఉంటే, దీన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు సేకరించి.. ప్రవేశపన్ను, శుద్ధి వ్యయాలు, నిల్వ వ్యయాలు, మార్జిన్లు కలుపకుని డీలర్‌కు రూ.30కి విక్రయిస్తున్నాయి. డీలర్ వద్దకు రూ.30కి చేరుతున్న పెట్రోల్.. పన్నుల వల్ల వినియోగదారులకు చేరేసరికి రూ.80 దాటుతోంది. అంటే పన్నుల రూపేణా 130 శాతం ధర పెరుగుతోంది.

కేంద్రం ఎక్సయిజ్ పన్నులు, రాష్ట్రాలు 'వ్యాట్'ను విపరీతంగా పెంచటమే దీనికి కారణం. 2014 నవంబర్ నుంచి 2016 జనవరి మధ్యకాలంలో కేంద్రం ఎక్సయిజ్ డ్యూటీని తొమ్మిదిసార్లు పెంచినట్టు సమాచారం. భారత్ కన్నా పొరుగుదేశాల్లో పెట్రో ధరలు తక్కువ. పాకిస్తాన్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.50.6, డీజిల్ రూ.57. బంగ్లాదేశ్‌లో రూ.68.4, 51.7. శ్రీలంకలో రూ.49.6, రూ.40.3. నేపాల్‌లో రూ.66.6, రూ.54.7 (సెప్టెంబర్–అక్టోబర్ 2018). అమెరికాలో ఇంధన పన్నులు 17 శాతం, పాకిస్తాన్‌లో 23.5 శాతం, ఐరోపా దేశాల్లో 21 శాతం, బంగ్లాదేశ్‌లో 15 శాతంగా ఉన్నాయి. భారత్ పెట్రోల్ ధరల్లో పన్నుల వాటా దాదాపు 50 శాతంకాగా, డీజిల్ ధరల్లో ఇది 40 శాతం. దీనిపై పరిశ్రమల సంఘం అసోచామ్ ఇటీవల ఒక పత్రాన్ని విడుదల చేసింది. పన్నులు తగ్గించాలని సూచించింది. పన్నుల తగ్గింపుతోటే.. ఇంధన ధరల పెరుగుదల సమస్యకు పరిష్కారం చూపగలమని పేర్కొంది. ఇంధనంపై ఎక్సయిజ్ సుంకం రూపేణా కేంద్ర ప్రభుత్వం రోజుకు రూ.660 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.450 కోట్లు చొప్పున ఆదాయం సంపాదించాయని లెక్కగట్టింది. 2016–17లో కేంద్రం రూ.2.4 లక్షల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.6 లక్షల కోట్లు ఇలా ఆర్జించాయని వెల్లడించింది.

ఇంధన ధరలు తగ్గితే, ఎగుమతుల రంగానికి ఊతం లభిస్తుందని, ధరపరంగా ఇతర దేశాల ఉత్పత్తులతో పోటీపడగలుగుతామని అసోచామ్ ఇంధన ధరల పత్రం తెలిపింది. ఎగుమతులు వృద్ధి చెందితే దేశ కరెంట్ ఖాతా లోటు తగ్గుతుందని, రూపాయి క్షీణతకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొంది. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) పరిధిలోకి పెట్రోలియం ఉత్పత్తులనూ తేవాలని, అప్పుడే అంతర్జాతీయ మార్కెట్ స్థాయిలో దేశీయంగా వాటి ధరలు ఉంటాయని తెలిపింది. అప్పుడు ఇంధన ధరలను ప్రభుత్వం పర్యవేక్షించాల్సిన అవసరం ఉండదని, అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ఉండే కమోడిటీలాగానే వీటినీ చూస్తారని, ప్రత్యామ్నాయాల వైపూ మొగ్గుచూపుతారని పేర్కొంది. ■

# పౌష్టికాహారం పురుగులు పడుతోంది



**వి**జయనగరంలో అంగన్‌వాడీలకు, విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి సరఫరా అవుతున్న గుడ్లు, ఇతర ఆహార సామాగ్రి పాడైపోవటం, నాసిరకంగా ఉండటం వల్ల భావిపౌరుల ఆరోగ్యానికి ముప్పువాటిల్లే ప్రమాదముందని, ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింటుందని లోక్‌సత్తా పార్టీ యువసత్తా జిల్లా ప్రతినిధి, నియోజకవర్గ అధ్యక్షుడు రొక్కం గురునాథం హెచ్చరించారు. పట్టణంలోని పలు పాఠశాలల్ని యువసత్తా బృందం సందర్శించిన అనంతరం మాట్లాడుతూ.. బడిపిల్లల కోసం రెండు వారాల ముందుగానే గుడ్లను సరఫరా చేస్తున్నారని, వీటి నిల్వ ఏర్పాట్లు కొరవడుతున్నాయని అన్నారు. ప్రతి నెలా 19,36,000 గుడ్లు సరఫరా అవుతూ, ప్రభుత్వ సొమ్ము కోటి రూపాయల దాకా ఖర్చయ్యే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకుల నాణ్యత మరీ దారుణంగా ఉందన్నారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టిహారాన్ని అందించటం మీద పాలకులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. యువసత్తా కార్యదర్శి పీఎల్ఎన్ రాజు, అనీల్, పెంటబాబు తదితరులు పాల్గొన్నారు. ■

# జీవనానికి హాట్‌స్పాట్‌ల దెబ్బ



మనిషి సృష్టిస్తున్న అనర్థాల వల్ల కావచ్చు, వాతావరణంలో సంభవిస్తున్న ఇతరత్రా పెనుమార్పుల వల్ల కావచ్చు.. భూగోళంపై ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. వర్షపాతంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామాలు మనిషి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. జీవన ప్రమాణాల్ని కుంగదీస్తున్నాయి. ఆర్థికవృద్ధిని మందగింప చేస్తున్నాయి. వ్యవసాయం కుంటుపడేలా చేస్తున్నాయి. దక్షిణాసియాలో, ముఖ్యంగా భారతదేశంలో ఈ 'వాతావరణ హాట్‌స్పాట్'ల (వాతావరణ, ఉష్ణోగ్రతల ప్రభావానికి లోనయ్యే) ప్రమాదం మరీ ఎక్కువగా ఉంది.

ఈ అంశాల్ని వివరిస్తూ– 'సౌత్ ఏషియన్ హాట్‌స్పాట్స్: ద ఇంపాక్ట్ ఆఫ్ టెంపరేచర్ అండ్ ప్రెసిపిటేషన్ ఛేంజెస్ ఆన్ లివింగ్ స్టాండర్డ్స్' పేరుతో ప్రపంచబ్యాంకు ఓ నివేదికను విడుదల చేసింది. భవిష్యత్తులో చోటు చేసుకోబోయే వాతావరణ, వర్షపాత మార్పుల ప్రభావాన్ని ఇంటింటి సర్వే గణాంకాలతో సమ్మిళితం చేసి.. జీవన ప్రమాణాలు ఎలా తగ్గిపోతాయో వివరిస్తూ.. ప్రపంచబ్యాంకు విడుదల చేసిన మొట్టమొదటి సమగ్ర నివేదిక ఇది. వాతావరణ సున్నితత్వం, కర్బన తీవ్రత అనే రెండు అంశాల్ని నివేదిక ప్రధానంగా చర్చించింది. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో తీర, పర్వత ప్రాంతాలకంటే కూడా దేశం మధ్యలో ఉండే ప్రదేశాలే ఎక్కువగా ఉంటాయని విశ్లేషించింది. ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులపై, మనుషుల ఆరోగ్యంపై పడే ప్రభావం, ప్రజల వలసలు తదితర అంశాల్ని నివేదిక చర్చించింది.

**జీవన ప్రమాణాలు తగ్గడానికి కారణం..**

ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతాయి. కార్మిక ఉత్పాదక సామర్థ్యం పడిపోతుంది. మనుషుల ఆరోగ్యం క్షీణిస్తుంది. ఇప్పటికే వెనుకబడి ఉన్న ప్రాంతాలు నీటిపరంగా

## నివేదిక వినిపించిన ప్రమాద ఘంటికలు

- స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2.8 శాతం మేర పడిపోతుంది. దీని వల్ల 2050 నాటికి భారత్‌లో 1.1 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం సంభవిస్తుంది. ఆంధ్రప్రదేశ్ స్థూల ఉత్పత్తిలో 3.4 శాతం దాకా నష్టపోతుంది.
- 2050 నాటికి దేశ జనాభాలోని దాదాపు సగం మంది జీవన ప్రమాణాలు తగ్గిపోతాయి.
- తీవ్ర హాట్‌స్పాట్‌లుగా మారే జిల్లాల్లో సగటు వినియోగం 9.8 శాతం మేర పడిపోతుంది. ఈ మొత్తం విలువ 40,000 కోట్ల డాలర్లుగా ఉంటుంది. ముఖ్యంగా విదర్భ ప్రాంతంలో సగటు వినియోగం 10 శాతం మేర పడిపోతుంది.
- ప్రస్తుతం ఒక మోస్తరు నుంచి తీవ్ర హాట్‌స్పాట్‌లలో నివసిస్తున్న జనసంఖ్య 2050 నాటికి మూడింతలు పెరగవచ్చు.
- మధ్యభారతంలో ప్రజలు నివసించే తీవ్ర హాట్‌స్పాట్ జిల్లాలు ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో ఎక్కువగా ఉంటాయి. ఉత్తర, వాయవ్య భారతాల్లోనూ ఈ ప్రభావం ఉంటుంది. 2050 నాటికి ఈ జిల్లాల్లో ప్రజల జీవన ప్రమాణాలు 9 శాతం మేర పడిపోతాయి.
- దేశంలో వ్యవసాయ సంక్షోభం ఎదుర్కొంటున్న విదర్భ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ప్రధాన హాట్‌స్పాట్‌లుగా నివేదిక గుర్తించిన 10 జిల్లాల్లో 7 జిల్లాలు ఒక్క విదర్భ ప్రాంతంలోనే ఉన్నాయి. ఈ ఏడు జిల్లాల్లో 2050 నాటికి జీవన ప్రమాణాలు 11 శాతం మేర పడిపోవచ్చు.
- భారత్‌లో నీటికొరత వస్తుంది. హాట్‌స్పాట్ జిల్లాలపై ఆ ఒత్తిడి మరీ ఎక్కువగా ఉంటుంది.
- ప్యారిస్ వాతావరణ ఒప్పందం-2015 ప్రకారం భూగోళంపై ఉష్ణోగ్రతల్ని 2 డిగ్రీల మేరకు తగ్గించే లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ.. మనదేశంలో మాత్రం సరాసరి ఉష్ణోగ్రత ఒకటి నుంచి రెండు సెల్సియస్ మేర పెరిగే అవకాశం ఉంది.

మరింత ఒత్తిడికి లోనవుతాయి. దీంతో అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతాయి.

### పర్వత ప్రాంతాల్లో

వాతావరణ మార్పుల వల్ల పర్వత ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు పెరిగే ప్రమాదం ఉంది. కొండ చరియలు విరిగిపడటం, మంచుపర్వతాలు కరిగిపోవటం, వరదలు సంభవించవచ్చు. వాటి వల్ల సమీప గ్రామాలు సమూలంగా తుడిచిపెట్టుకునిపోయే ప్రమాదం ఉంది.

### కోస్తా ప్రాంతాల్లో

వాతావరణ మార్పుల వల్ల సముద్ర మట్టాలు పెరుగుతాయి. ఇది భారత్‌లోని కొన్ని తీరప్రాంతాలకు ప్రమాదకరం. సమీప ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. వరద ముప్పు ఎక్కువగా ఉంటుంది.

### పరిష్కార చర్యలు

వాతావరణ పరిస్థితులకు తట్టుకుని నిలబడాలంటే హాట్‌స్పాట్‌లలో కొన్ని చర్యలు చేపట్టాలని నివేదిక సూచించింది.

- నీటి ఒత్తిడిని తగ్గించాలి
- పెట్టుబడులపై ఎక్కువ దృష్టి పెట్టాలి
- విద్యా ప్రమాణాలు పెంచాలి
- వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాల్ని మెరుగుపరచాలి


.. ఈ చర్యలు కనీసం 30 శాతం మెరుగుపడినా- జీవన ప్రమాణాలు పడిపోవటాన్ని కనీసం ఒక్క శాతమైనా తగ్గించవచ్చు. ■

# ప్రమాద హెచ్చరిక ఇంకా తీవ్రతరం

వాతావరణ మార్పులపై ప్రమాద హెచ్చరిక తీవ్రత పెరిగింది. వాతావరణ ఒడిదుడుకులతో ముంచుకురానున్న పెను విపత్తుల నుంచి తప్పించుకోవాలంటే సమాజం, ప్రపంచం ఆర్థిక వ్యవస్థలో కనీవినీ ఎరుగని మార్పులు చేసుకోవాలని ఐక్యరాజ్యసమితి స్పష్టం చేసింది. ఇందుకు సమయం మించిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ నేతలకు తుది హెచ్చరిక చేసింది. పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే భూ ఉపరితల ఉష్ణోగ్రత 1 డిగ్రీ సెల్సియస్ మేర వేడెక్కిందని ఐరాస పేర్కొంది. దీనివల్లే తుపానులు, వరదలు, కరవుల తాకిడి పెరుగుతోందని తెలిపింది. వాతావరణంలోకి హానికారక వాయువుల విడుదల ప్రస్తుతమున్నట్టుగానే కొనసాగితే భూతాపంలో పెరుగుదల భరింపశక్యంకాని రీతిలో 3-4 డిగ్రీల సెల్సియస్‌కు చేరుతుందని హెచ్చరించింది. ఈ పెరుగుదలను 1.5 డిగ్రీలకన్నా తక్కువకు పరిమితం చేయకుంటే సముద్రమట్టాలు బాగా పెరుగుతాయని స్పష్టం చేసింది. దీనివల్ల భారత్ వంటి వ్యవసాయాధార, ఉష్ణమండల దేశాల్లో పెనునష్టం తప్పదని చెప్పింది. పేదదేశాలు, చిన్నదీవులు చితికిపోతాయని తెలిపింది.

ఐరాస అనుబంధ విభాగమైన వాతావరణ మార్పుల అంతర్ ప్రభుత్వ కమిటీ తాజాగా ఒక నివేదికను వెలువరించింది. 'ఎ సమ్మరీ ఫర్ పాలసీ మేకర్స్' అనే ఈ పత్రానికి దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో ఇటీవల జరిగిన వాతావరణ సదస్సులో ఆమోద ముద్ర వేశారు.

పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే భూతాపంలో పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువకు పరిమితం చేయాలని, 1.5 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గించుకోవడానికి ప్రయత్నించాలని 2015 నాటి ప్యారిస్ ఒప్పందం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను ఎంతమేరకు కుదించుకోవడం శ్రేయస్కరమన్న అంశంపై ఐపీసీసీ నిపుణులు దృష్టి సారించారు. వాతావరణ మార్పులపై ఇప్పటికే జరిగిన అనేక పరిశోధనలను విశ్లేషించి, ఒక నివేదికను తయారుచేశారు. అందులో అనేక చేదు నిజాలు వెలుగులోకి వచ్చాయి. వాతావరణ మార్పుల దుష్ప్రభావాలతో భవిష్యత్ ఎలా ఉండబోతుందన్నది నివేదిక కళ్లకు కట్టింది. పరిష్కార మార్గాలను కళ్లకు కట్టింది. మా పని మేం చేశాం.



ఇప్పుడు దీనిపై స్పందించాల్సింది ప్రభుత్వాలే.. అని ఐపీసీసీ సహ అధ్యక్షుడు జిమ్ స్కియా అన్నారు. నివేదికలోని అంశాల ప్రకారం..

- భూతాపంలో 2 డిగ్రీల సెల్సియస్ పెరుగుదల హద్దు అనే భావన చాలా కాలం కొనసాగింది. అయితే భూతాప ప్రభావం ఊహించినదాని కన్నా వేగంగా, చాలా దారుణంగా ఉంది. భవిష్యత్తులో జరుగుతాయనుకున్న మార్పులు ఇప్పుడే చోటు చేసుకుంటున్నాయి.
- ఐపీసీసీ లోగడ ఇచ్చిన నివేదికతో పోలిస్తే 2 డిగ్రీల సెల్సియస్ వద్ద దుష్ప్రభావాలు చాలా ఎక్కువగా ఉంటాయి. తీవ్ర వడగాల్పులు, తుపాన్లు, వరదలు, కరువు తాకిడి పెరిగిపోతుంది. వ్యవసాయం దెబ్బతింటుంది. కోట్లమంది పేదరికంలోకి జారిపోతారు. 1.5 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుదలతో ఇబ్బందులు ఎక్కువే.
- ప్రస్తుతమున్న స్థాయిలో గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల కొనసాగితే 1.5 డిగ్రీల సెల్సియస్ స్థాయిని 2030 నాటికే దాటిపోతాం.
- 1.5 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువకు పరిమితమయ్యేందుకు ప్రపంచ దేశాలు సిద్ధం కావాలి. ఇందుకోసం 2030 నాటికి కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను.. 2010తో పోలిస్తే 45 శాతం మేర తగ్గించాలి. 2050 నాటికి ప్రపంచం మొత్తం 'కార్బన్ న్యూట్రల్'గా మారిపోవాలి. అంటే వాతావరణంలోకి మనం విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్‌డైఆక్సైడ్‌కు బదులుగా ఒక టన్ను మేర ఆ వాయువును తొలగించాలి.

### లక్ష్యసాధన కోసం కొన్ని మార్గాలు

- ఇందులో అత్యంత ముఖ్యమైనది.. ఇంధన వినియోగాన్ని

### భారత్‌కు భూతాప ముప్పు ఎక్కువ

పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే భూతాపం 2 డిగ్రీల సెల్సియస్ పెరిగితే భారత్‌లో తీవ్ర వడగాలులు తప్పవని వాతావరణ మార్పుల అంతర్జాతీయ కమిటీ హెచ్చరించింది. వ్యవసాయం, మత్స్యసంపద మీద భారీగా ఆధారపడ్డ నేపథ్యంలో నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ఆ స్థాయి భూతాపం వల్ల సముద్ర మట్టాలు పెరుగుతాయని, కరవు, వరదలు ఎక్కువగా ఉక్కిరిబిక్కిరి చేస్తాయని నివేదికను విశ్లేషించిన పర్యావరణ సంస్థలు అభిప్రాయపడ్డాయి. 2022 నాటికి 175 గిగావాట్ల మేర పునరుత్పాదక ఇంధనాన్ని సాధించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని గ్రీన్‌పీస్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. దీనిసాయంతో భూతాపంలో పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువకు పరిమితం చేయడంలో భారత్ సాయం చేయవచ్చని పేర్కొంది. ఉష్ణోగ్రతలకు కళ్లెం వేసే దిశగా ఒక అంతర్జాతీయ కూటమికి మన దేశం నాయకత్వం వహించాలని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) పేర్కొంది.

### హరిత వృద్ధి విధానాలకు నోబెల్



వాతావరణం, ఆవిష్కరణలను ఆర్థిక వృద్ధితో ఎలా అనుసంధానించాలో తెలియజెప్పే కొన్ని విధానాలను రూపొందించినందుకు అమెరికా పరిశోధకులైన నార్డ్ హౌస్, పాల్ రోమర్‌లను ఈ ఏడాది ఆర్థిక శాస్త్ర నోబెల్ బహుమతికి ఎంపికచేశారు. "సుస్థిర వృద్ధి అవకాశాలను వదులుకోకుండా మనం పర్యావరణ పరిరక్షణ దిశగా పురోగతి సాధించొచ్చు. చాలామంది పర్యావరణ పరిరక్షణను ఖరీదైన, కఠినమైన వ్యవహారంగా భావిస్తుంటారు. అన్నింటిపైనా వారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటారు. ప్రయత్నిస్తే ఏదైనా సాధించే సామర్థ్యం మనకుంది" అని రాయల్ స్వీడిష్ అకాడమీ ప్రతినిధులతో మాట్లాడుతూ రోమర్ వ్యాఖ్యానించారు.

గణనీయ స్థాయిలో తగ్గించడం, అదే సమయంలో శిలాజ ఇంధనాలకు దూరం జరగడం, 2020 నుంచే కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను వేగంగా తగ్గించడం.

- ఇందుకు భిన్నంగా వనరులు, శిలాజ ఇంధనాలను ప్రస్తుతానికి ఎక్కువగా ఖర్చు చేసే విధానాన్ని అవలంబించొచ్చు. దీనివల్ల 1.5 డిగ్రీల సెల్సియస్ తాత్కాలికంగా దాటిపోతుంది. ఈ విధానంలో జీవ ఇంధనాలపై భారీగా ఆధారపడాలి. ఇందుకోసం భారత్‌కు రెట్టింపు విస్తీర్ణం ఉన్న ప్రాంతంలో జీవ ఇంధన పంటలను సాగు చేయాలి. దీనివల్ల 1200 బిలియన్ టన్నుల మేర కార్బన్ డై ఆక్సైడ్ (ప్రస్తుత లెక్కల ప్రకారం చూస్తే 30 ఏళ్లలో విడుదలయ్యే ఉద్గారాలు)ను సురక్షితంగా నేలలోనే బంధించవచ్చు.
- ఈ రెండో విధానంపై నిపుణులు పెదవి విరుస్తున్నారు. నేడు మనం వాతావరణంలోకి ప్రవేశపెడుతున్న కార్బన్ డై ఆక్సైడ్‌ను భవిష్యత్ తరాల వారు తొలగించాలనడం సబబేనా అని ఐపీసీసీ బృందంలో ఉన్న మైల్స్ అలెన్ అనే శాస్త్రవేత్త ప్రశ్నించారు.

#### ఖర్చు ఎక్కువే

భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గించడానికి ప్రపంచ ఇంధన వ్యవస్థలో ఏటా 2.4 లక్షల కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు అవసరమని ఐపీసీసీ అంచనా వేసింది. ఇది ప్రపంచ జీడీపీలో 2.5 శాతమని తెలిపింది. 2016 నుంచి 2035 వరకూ ఏటా ఈ మేర పెట్టుబడులు పెట్టాలంది. అయితే భూతాపంపై మిన్నకుండిపోతే తలెత్తే తీవ్రస్థాయి మూల్యంతో పోల్చినప్పుడు ఇది పెద్ద ఖర్చేమీ కాదని పేర్కొంది.

ఈ ఏడాది డిసెంబర్‌లో పోలండ్‌లో ఐరాస వాతావరణ శిఖరాగ్ర సదస్సు జరగనున్న నేపథ్యంలో ఐపీసీసీ నివేదికకు ప్రాధాన్యం ఏర్పడింది. నివేదిక వల్ల కర్బన ఉద్గారాల తగ్గింపునకు ఇచ్చిన హామీల పునస్సమీక్షకు ప్రపంచ నేతలపై ఒత్తిడి పెరుగుతుంది. లోగడ ఇచ్చిన హామీలను నెరవేర్చినా.. భూతాపంలో పెరుగుదల 3 డిగ్రీల సెల్సియస్‌కు చేరుతుంది. ■

# దేశభక్తి ఉంది కానీ..



పాలకులకు వ్యక్తిగత నిజాయతీ కనీస లక్షణం మాత్రమేనని, ఆ నిజాయతీని చూసే గొప్పవాళ్లనుకోనక్కర్లేదని జేపీ అన్నారు. పాలకులకు వ్యవస్థీకృత నిజాయతీ ముఖ్యమన్నారు. అందరికీ ఎదిగే అవకాశాలున్న వ్యవస్థల ఏర్పాటు వాళ్ల ప్రధాన బాధ్యతన్నారు. పాలకులు నిజాయతీగా ఆలోచించి హేతుబద్ధంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే.. అది మంచి పాలన అవుతుందన్నారు. సురాజ్యం సాకారమవుతుందన్నారు. ఆ సంస్కృతి ప్రజల్లో కూడా వేళ్లూనుకుంటే సురాజ్యం సుస్థిరమవుతుందన్నారు.

ప్రకాశం జిల్లా మార్కాపురంలోని సాధన డిగ్రీ కళాశాలలో జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆయన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు.

సురాజ్యం ఎలా వస్తుందో చెప్పండి అనే ప్రశ్నతో విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకుంటూ జేపీ మాట్లాడారు. ఈ సందర్భంగా శివ అనే విద్యార్థి లేచి నిలబడి.. మన ప్రజలకు దేశభక్తి లేదని, సినిమా హాల్లో జాతీయగీతానికి నిలబడాలన్న ఇంగితం కూడా లేదని, కనీసం క్యూలో నిలబడి కూడా పనులు చేసుకోవటం కూడా చేతకావటం లేదని ఆవేశంగా అన్నారు. అలాగే విజయలక్ష్మి అనే విద్యార్థిని రిజర్వేషన్లపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నారాయణ అనే విద్యార్థి దళితుల తరపున రిజర్వేషన్లను సమర్థించాడు. వీటన్నిటికీ జేపీ సమాధానమిస్తూ.. మనకు దేశభక్తి లేదనటం పొరపాటని వివరించారు. ప్రపంచంలో మనం అభివృద్ధి చెందాయి అనుకుంటున్న బెల్జియం, కెనడా వంటి దేశాల్లో కేవలం రెండు భాషల వల్ల నిత్యం కొట్లాటలు జరుగుతున్నాయని, ఎప్పుడు విడిపోతాయా అన్నట్టుందని అన్నారు. పొరుగున ఉన్న శ్రీలంకలో కేవలం రెండు భాషల వల్ల ఎంత మారణహోమం జరిగిందో మనందరికీ తెలుసన్నారు. ఇలాంటి ప్రపంచంలో 22 అధికారిక భాషలున్న భారతదేశం హాయిగా కలిసి ఉంటోందన్నారు. భూమ్మీద ఇంత వైవిధ్యమున్న దేశం ఇంకోటి లేదని, ఇక ముందు కూడా ఉండదని అన్నారు. ఇలా భిన్నత్వంలో ఏకత్వంతో ప్రపంచానికి మార్గం చూపుతుండటం భారతదేశ గొప్పతనానికి, భారతీయుల దేశభక్తికి నిదర్శనమేనన్నారు. అయితే దేశభక్తిని నిర్మాణాత్మకంగా వ్యక్తం చేయటంలో మనం ఇంకా పరిణతిని సాధించాల్సుందన్నారు. దేశభక్తి అంటే కేవలం జెండా ఎగరేయటం, వివిధ రాష్ట్రాల,

### దుర్రాజ్యానికి తంబళ్లపల్లే ఉదాహరణ

చిత్తూరు జిల్లా తంబళ్లపల్లెలో పట్టుచీరలు నేసినందుకు కార్మికులకు రోజుకు రూ. 300 వరకు మాత్రమే లభిస్తుందని, అదేగనక వారికి ముద్రా రుణాల కింద ఒక్కొక్కరికి రూ. 50వేలు ఇస్తే, వారి ఆదాయం ఒక్కసారిగా పదిరెట్లు పెరుగుతుందని జేపీ అన్నారు. చీర రూ. 16,000వరకు పలుకుతుండగా, నేసిన కార్మికులకు మాత్రం ఇప్పుడు అందులో పదోవంతు మాత్రమే లభిస్తోందని అన్నారు. వివిధ కారణాల వల్ల వారికి ముద్ర రుణాలు అందటం లేదన్నారు. దుర్రాజ్యానికి ఇంతకంటే ఉదాహరణ అక్కర్లేదన్నారు.

### స్వరాజ్యం వచ్చింది.. సురాజ్యం రావాలి

మనకు స్వరాజ్యం వచ్చిందని, కానీ అది అసంపూర్ణ స్వరాజ్యమేనని జేపీ అన్నారు. బ్రిటిష్ వారిని యథాతథంగా అనుకరించటం మినహా మనదేశానికి కావలసిన మార్పుల్ని చేసుకోకపోవటం వల్ల ఓటు వేయటం, ఆ తర్వాత అరవటమే ప్రజాస్వామ్యంగా తయారైందన్నారు. అరకొర స్వరాజ్యాన్ని సంపూర్ణ స్వరాజ్యంగా మార్చేందుకే సురాజ్య యాత్ర కార్యక్రమమన్నారు.

### ప్రజాస్వామ్య నిర్మాణం అంత తేలికాదు

లోక్‌సత్తా పట్ల, జేపీ నాయకత్వం పట్ల ఎన్నో ఆశలు ఉన్నా ఎందుకు ఎన్నికల్లో విజయం సాధించలేదు? అన్న ప్రశ్నకు జవాబిస్తూ.. ప్రజాస్వామ్యం అత్యంత సంక్లిష్ట ప్రక్రియ అని, భారత్ వంటి దేశంలో అది మరీ కష్టమని అన్నారు. కానీ ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం లేదని అన్నారు. బ్రిటన్ వంటి దేశంలో 1215లో మాగ్నాకార్టాకు అంకురార్పణ జరిగితే, ప్రజాస్వామ్యం బలపడటానికి 700 ఏళ్లకు పైగా పట్టిందన్నారు. మనదేశానికి అంత సమయం లేదన్నారు. లోక్‌సత్తా అధికారంలోకి వచ్చేస్తుందని తాను భావించలేదని, కానీ 10శాతం ఓట్లు సాధిస్తే చాలనుకున్నానని తెలిపారు. ఏ అధికారం లేకుండానే 3 రాజ్యాంగ సవరణల్ని, ఏడెనిమిది చట్టాలను, ఐదారు విధానపరమైన మార్పుల్ని సాధించిన లోక్‌సత్తా.. 10శాతం ఓట్లు వస్తే మిగతా పార్టీల్ని కచ్చితంగా మార్చగలిగేదన్నారు. కాస్త ఆలస్యంగానైనా మార్పు వచ్చి తీరుతుందన్నారు.

ఆచార వ్యవహారాల పండుగల్ని నిర్వహించుకోవటం మాత్రమే కాదని.. అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించేందుకు కావలసిన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటివి అందించటం కూడానన్నారు. దేశమంటే మట్టి కాదు మనుషులని గుర్తించి ఇలా నిర్మాణాత్మక ఎజెండా కోసం పనిచేయటమే నిజమైన దేశభక్తి అన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర అన్నారు. మనదేశంలో దేవుడి పేరు మీద ఎంతో ప్రయాసపడే ప్రజల్లో అనేకమంది.. సాటి మనుషుల్ని సమానంగా చూడటానికి మాత్రం ఇష్టపడరని, ఒకరు ఎక్కువ, ఇంకొకరు తక్కువ అనేది చాలా మామూలు విషయంగా భావిస్తారని అన్నారు. ఎన్ని జెండా పండుగలు చేసినా, ఇలాంటి వివక్షలతో దేశానికి మేలుచేయలేమన్నారు. ప్రజలకు కనీస జీవితాన్నిచ్చే తాగునీరు, విద్యుత్తు, విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి అంశాల్లో మనదేశం 57 దేశాల మధ్య 55వ స్థానంలో ఉందని, విద్యలో 74 దేశాల మధ్య 73వ స్థానంలో ఉందని అన్నారు. దేశ ప్రజల్లో అత్యధికుల జీవితాలు ఇంత అధ్వాన్నంగా ఉంటే, ఇదంతా మామూలే అని మనం స్పందించకుంటే.. మనకున్నది పైపై దేశభక్తే అవుతుందన్నారు. నిర్మాణాత్మక దేశభక్తిగా దాన్ని మలచుకుని ఈ పరిస్థితుల్ని బాగు చేయాలని, అప్పుడే మనదేశం అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని

### చిన్న పట్టణాలకు పెద్ద భవిష్యత్తు

పెద్ద నగరాల్లో కన్నా చిన్న పట్టణాల్లో ప్రజలకు సౌకర్యాలు కల్పించి భాగస్వాముల్ని చేయటం తేలికని, అందుకు తగ్గ వనరులు అక్కడ ఉంటాయని, అందుకని గ్రామాల చుట్టూ చిన్న పట్టణాల వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని జేపీ అన్నారు.

### మేధస్సు, సాంకేతికతతోనే ఉపాధి

పారిశ్రామిక విప్లవం నుంచి కండబలం కంటే బుద్ధిబలానికి ప్రాధాన్యత పెరిగిందని, కానీ మనం విద్యను బాగు చేసుకోకపోవడం వల్ల ఇంజినీరింగ్ చదివిన విద్యార్థుల్లో 80శాతానికి ఉపాధి అవకాశాలు లభించటం లేదని జేపీ అన్నారు. మేధస్సును వికసింపచేసుకోవటం, సాంకేతికతను అందిపుచ్చుకోవటంతోనే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సూచించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించటం సరికాదని, అయితే అర్హులకు దక్కేలా, ఇతర కులాల్లో పేదలకీ అవకాశాలు లభించేలా సంస్కరించాల్సుందని అన్నారు. రిజర్వేషన్లు సర్వరోగ నివారిణి అని అంబేద్కర్ కూడా భావించలేదని స్పష్టం చేశారు.

అన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల్ని ఖర్చు చేస్తున్నా, ఏపీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీదా ఏటా రూ.60,000 వెచ్చిస్తున్నా విద్యలో ఫలితాలు రావటం లేదని, అయితే చీమకుర్తిలో బధిరులకు వసతితో కలిపి రూ.30,000లతోనే నాణ్యమైన పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. చుట్టూ జరుగుతున్న ఈ పరిణామాలను, పరిష్కారాలను గుర్తించి అమలుచేయించటమే నిజమైన దేశభక్తి అన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని బాగు చేసేందుకు ఈవేళ కావలసిన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, లంచాల్లేని ప్రభుత్వసేవలు, స్థానిక సాధికారత, లాభసాటి వ్యవసాయం అనే దేశభక్తి ఎజెండాతోనే సురాజ్య యాత్ర చేపట్టామన్నారు. సురాజ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావడానికి యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదవ్వాలన్నారు.

ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వీఆర్‌కే ప్రసాద్, సాధన సంస్థల డైరెక్టర్లు రాజగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్, లోక్‌సత్తా ఏపీ, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, శివరమేష్‌రెడ్డి, జిల్లా నేతలు రఫీ, అహ్మద్, ప్రజా సైన్స్ వేదిక నాయకుడు డాక్టర్ సీఏ ప్రసాద్, వైబీఐ రాష్ట్ర కన్వీనర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.■

# రామాయపట్నానికి మార్గం సుగమం







రామాయపట్నం ఓడరేవు నిర్మాణానికి ఎట్టకేలకు పాలకుల్లో కదలిక వచ్చింది. ఈ ఓడరేవు నిర్మాణానికి రూ.4,500 కోట్లు ఖర్చవుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేసింది. కృష్ణపట్నం ఓడరేవు పరిధి కుదింపు, రామాయపట్నం ఓడరేవు నిర్మాణానికి ఆర్థిక వనరుల సమీకరణ తదితర అంశాలపై దృష్టి సారించాలని.. ఇంధన, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ఓడరేవుల డైరెక్టర్‌కి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు 9 కీలకాంశాలతో ఏడాదిలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి చర్యలు ప్రారంభమయ్యాయి. రామాయపట్నం ఓడరేవు నిర్మాణం వల్ల ప్రకాశంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో కూడా ఉపాధి కల్పన, అభివృద్ధి పెరుగుతాయని భావిస్తున్నారు. రాష్ట్ర విభజనకు ముందు కేంద్రప్రభుత్వం వేసిన కమిటీ, విభజన తర్వాత 2015లో రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు మెస్సర్స్ రైట్స్ రూపొందించిన టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టు (టీఈఎఫ్ఆర్) రెండూ పోర్టు నిర్మాణానికి రామాయపట్నం అనుకూలమనే చెప్పాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త భాగస్వామ్యంతో ప్రతిపాదించిన వాడరేవు కంటే కూడా రామాయపట్నం మెరుగని, మేజర్ పోర్టుగా నిర్మించాలని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు.■

## రామాయపట్నం కోసం 2010-11 నుంచి జేపీ డిమాండ్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో సంక్షుభిత పరిస్థితుల మధ్య కూడా 'వన్ మ్యాన్ విత్ కన్విక్షన్ ఈజ్ ఎ మెజారిటీ'లా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అసెంబ్లీలో లేవనెత్తిన అంశాల్లో వాన్‌పిక్ కుంభకోణం ఒకటి.


వాన్‌పిక్ సహా ప్రైవేటు ఓడరేవుల పేరుతో 348 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని మరొకరు అడుగుపెట్టటానికి వీల్లేకుండా ఒకే గ్రూప్‌నకు ధారాదత్తం చేస్తూ వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని 2010-11లో సభలో లేవనెత్తి.. అందులోని భారీ అవినీతి, అక్రమాలను జేపీ ఎండగట్టారు. ఈ భారీ కుంభకోణం బైటపడటానికి వెనక అసలు కారణం, ఏదో తీగలాగితే డొంక కదిలినట్టు బైటపడింది.

విశాఖలో నేవల్ బేస్ విస్తరణ కోసం కొంత తీరప్రాంతాన్ని కేటాయించినందుకు పరిహారంగా రక్షణశాఖ రూ.1000కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చింది. ఆ డబ్బుతో దక్షిణాదిన ఒక పోర్టు, షిప్‌యార్డు నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. అయితే దక్షిణాదిన ఉన్న తీరప్రాంతాన్ని శాశ్వత ప్రాతిపదికన ఆ కృష్ణపట్నం, మచిలీపట్నం, వాన్‌పిక్ పోర్టులకు ఇచ్చివేసినందున కొత్త పోర్టుకు, షిప్‌యార్డుకు అవసరమైన స్థలాన్ని కేటాయించలేమని, కావాలంటే విశాఖ పక్కనున్న నక్కపల్లిలో తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది. తుని నుంచి తడ దాకా.. వందల కిలోమీటర్ల తీరప్రాంతంలో ప్రభుత్వానికి కూడా ఒక్క ఎకరం భూమి కూడా దొరకని పరిస్థితి చూశాక ఆంధ్రప్రదేశ్‌లో ఎంతటి దారుణమైన దోపిడీ జరుగుతోందో సాక్ష్యాధారాలతో బైటపడింది.

ఈ వివరాలన్నిటినీ మీడియాలో, రాష్ట్రంలోని వివిధ సభలలో, అసెంబ్లీలో జేపీ సవివరంగా తెలియచేస్తూ.. ఏపీలో మరో పోర్టు నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేయటానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత కేంద్రం ఒక కమిటీని నియమించింది. రామాయపట్నం ప్రాంతాన్ని పోర్టు ఏర్పాటుకు అనువైనదిగా కమిటీ నిర్ణయించింది. కానీ అక్కడున్న కొందరు ఎంపీలు, రాజకీయ నేతలు స్వార్థప్రయోజనాల కోసం రామాయపట్నానికి గండి కొట్టేలా దుగ్గరాజపట్నం పేరును ప్రతిపాదించారు. 'దుగ్గరాజపట్నానికి కూడా పోర్టు వస్తే సంతోషమే. కానీ పక్కనే కృష్ణపట్నం ఉండగా, దుగ్గరాజపట్నం అంతగా లాభసాటిగా ఉండదు కాబట్టి, ముందుగా రామాయపట్నంలో ఏర్పాటు చేసేందుకు తెలుగువారంతా సమష్టిగా కృషి చేయాలని' జేపీ విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత విభజన చట్టంలో దుగ్గరాజపట్నం పేరును చేర్చారు. దీంతో రామాయపట్నంతోపాటు దుగ్గరాజపట్నం పోర్టుని కూడా కేంద్రం ఇవ్వాల్సి ఉందని, రామాయపట్నాన్ని నిర్మిస్తూనే దుగ్గరాజపట్నం పోర్టును లేదా అదే ప్రాంతంలో అవే నిధులతో వేరే లాభసాటి ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని జేపీ సూచించారు.

# ఈ కుదుపు కావాలి ఓ మలుపు

- సీబీఐలో రభస మార్పు తెచ్చిపెడుతుంది
- దేశవ్యాప్త చర్చతో అది సాధ్యమే
- కీలక సంస్థల బాగుకు స్వతంత్ర వ్యవస్థలు అవసరం
- ఈనాడు ప్రత్యేక ఇంటర్వ్యూలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్



**దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. పరిపాలనా వ్యవస్థల్లో ప్రభుత్వాల మితిమీరిన జోక్యం మరోసారి బట్టబయలైంది. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా పక్షపాత పాలనకు అడ్డుకట్ట పడటం లేదన్న విషయం మరోమారు రుజువైంది. స్వపక్షాన్ని కాపాడుకోవడం, ప్రతిపక్షంపై పగ సాధించడం అనే ధోరణి ప్రభుత్వాల్లో పెరిగిపోతోంది. ఈ దుస్థితికి కారణాలు ఏమిటి? దీన్నుంచి ఎలా బయటపడాలన్న విషయాలను ఈ ఇంటర్వ్యూలో జేపీ 'ఈనాడు'తో పంచుకున్నారు.**

**(?) సీబీఐ దర్యాప్తు వల్ల న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉండేది. అందుకే కాస్త వివాదాస్పదమైన కేసు ఏదయినా ఆ సంస్థే విచారణ జరపాలని కోరేవారు. ఇప్పుడు అదే సంస్థ రోడ్డున పడింది. ఉన్నతాధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ, కేసులు పెట్టుకుంటూ దాని పరువు బజారు కీడుస్తున్నారు. దేశంలోనే అత్యున్నత దర్యాప్తు విభాగం ఈ దుస్థితికి దిగజారడానికి కారణాలు ఏమిటి? దీని పర్యవసానాలు ఎలా ఉండబోతున్నాయి.**

ఇదీ ఒకరకంగా మంచిదే అని నేను భావిస్తున్నా. దీనివల్ల కనీసం భవిష్యత్తులో అయినా సీబీఐ బాగుపడుతుందని నమ్ముతున్నా. లోపల అంతా కొట్టుకుంటూ బయటకు రాకుండా చూసుకోవడం కంటే ఇలా బయటపడటం వల్లయినా మేలు జరుగుతుంది. సీబీఐలో వేళ్లూనుకున్న లోపాలు బయటపడబట్టే అర్ధరాత్రి జరిగిన పరిణామాలపై దేశవ్యాప్తంగా ఇంత చర్చ మొదలైంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. ఈ స్థాయిలో చర్చ జరగడం, న్యాయస్థానాలకు వెళ్లడం, ప్రజలు పట్టించుకోవడం ఒకరకంగా చట్టబద్ధపాలన బాగుపడటానికి ఇదొక మార్గంగా భావిస్తున్నా.

**(?) ఇలాంటి పరిణామాలు ఎలాంటి మార్పులు తీసుకొస్తాయంటారు**

ఇటీవలి కాలం వరకూ పౌర సమాజం, పత్రికలు, నేర పరిశోధనలో రాజకీయ జోక్యం గురించి పెద్దగా పట్టించుకోలేదు. గతంలోనూ చాలామంది అవినీతిపరులను సీబీఐలో నియమించారు. మాజీ డైరెక్టర్ రంజిత్‌సిన్హా ఇందుకు ఉదాహరణ. పక్షపాతం, అసమర్థత, అవినీతికి ఆయన ప్రతీక. అయినా ఆయన విషయంలో ఇంత చర్చ జరగలేదు. తాజా పరిణామాలు దేశానికి మేలే చేస్తాయని భావిస్తున్నా. సీబీఐని బలోపేతం చేసేందుకు గతంలోనూ ప్రయత్నాలు జరిగాయి. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కొన్ని సంస్కరణలు చేశారు. ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తుల ఆమోదంతో సీబీఐ డైరెక్టర్ నియామకం జరగాలనే నిబంధన తెచ్చారు. దేశంలో మరే సంస్థకూ ఇలాంటి విధానం లేదు.

**(?) అప్పుడప్పుడూ పరిపాలనాపరమైన సంస్కరణలు తెస్తున్నా రాజకీయ నాయకులు వాటికి ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొంటున్నారు. ఉదాహరణకు అలోక్‌వర్మ తన మాట వినకపోయే సరికి రాకేష్ ఆస్థానాను ప్రత్యేక డైరెక్టర్‌గా నియమించారు. అంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా తమ అధికారంతో వాటిని అధిగమిస్తామనే భావన కల్పిస్తున్నారు. ఇటువంటప్పుడు అందరికీ న్యాయం ఎలా జరుగుతుంది**

ప్రభుత్వం చేసిన తప్పునకు తగిన శాస్తే జరిగింది. ఆస్థానాను తెచ్చి పెట్టుకోబట్టే ఇప్పుడు విమర్శల దుమారంలో ఇరుక్కుంది. తాము ఏమి చేసినా చెల్లుతుందనే భావనతో ప్రతిపక్షాలు వద్దన్నా ఆయన్ను ప్రభుత్వం

**సీబీఐ లేదా మరే వ్యవస్థ అయినా అధికారుల నియామకాల్లో ప్రభుత్వ జోక్యం ఉన్నంత కాలం చట్టం... అధికారం ఉన్నవారికి చుట్టమే అవుతుంది**



**నేను కలెక్టర్‌గా పనిచేసినప్పుడు ఎలాంటి సంశయం లేకుండా స్వేచ్ఛగా సిబ్బందిని బదిలీ చేసేవాడిని. నాతో పనిచేసే ఎస్పీ ఒక ఎస్సైని మార్చాలన్నా హైదరాబాద్ నుంచి అనుమతి అవసరం అయ్యేది. దీన్నిబట్టి రాజకీయ పార్టీలు పోలీసు వ్యవస్థను తమ అదుపులో ఉంచుకునేందుకు ఎంతగా తపిస్తాయో అర్థం చేసుకోవచ్చు.**

నియమించింది. ఆ నిర్ణయమే ఇప్పుడు ఇంత పెద్ద వివాదానికి కారణమైంది. ఎవరు తప్పు చేసినా ఎప్పుడో ఒకప్పుడు మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇంత రాద్ధాంతం వల్లే మార్పు కూడా వస్తుందని ఆశిస్తున్నా.

**(?) పోలీసు వ్యవస్థను ప్రభుత్వ కబంధ హస్తాల నుంచి తప్పించి స్వతంత్రంగా పనిచేసేందుకు అవసరమైన సంస్కరణలకు సంబంధించి 2006లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇందులో పలు మార్పులు సూచించింది. పోలీసుల నియామకాల్లో ప్రభుత్వ జోక్యం నివారించడం, క్షేత్రస్థాయిలో పనిచేసేవారిని రెండేళ్ల వరకూ బదిలీ చేయకూడదన్న నిబంధనతోపాటు డీజీపీ నియామకాన్ని యూపీఎస్సీ పరిధిలోకి తెచ్చింది. ఈ విధానాన్ని కూడా ప్రభుత్వాలు పాటించడం లేదు. సాక్షాత్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునే పాటించకపోతే ఈ వ్యవస్థలు ఎలా బాగుపడతాయి**

నిజమే. దేశంలో ఒకటీ రెండు రాష్ట్రాలు మినహా అన్నీ సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తున్నామని చెప్పి మళ్లీ అదే డ్రామా ఆడుతున్నాయి. ఇక్కడ మనం మూడు అంశాలు పరిగణలోకి తీసుకోవాలి. చట్టబద్ధమైన పరిపాలన సాగాలంటే నేర పరిశోధన సమర్థంగా, నిజాయతీగా, నిష్పాక్షికంగా జరగాలి. దేశంలో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అటెండర్ నుంచి ప్రధాని వరకూ అధికారం కోసమే తపించే దేశం మనది. తాము ప్రజలకు సేవకులం అనే భావనపోయి ప్రజలే తమ సేవకులని భావిస్తున్నారు. ఇందుకోసం కీలకమైన పోలీసు వ్యవస్థను ఎక్కువగా వాడుకుంటున్నారు. కేసులు పెట్టి, అరెస్టు చేసి, జైలుకు పంపే అధికారం పోలీసులకే ఉంటుంది. అందుకే రాజకీయ నాయకులు ఈ వ్యవస్థను లొంగదీసుకుంటున్నారు. దాని ద్వారా తమ అధికారం పదిల పరచుకోవాలనుకుంటున్నారు.

**(?) కీలక సంస్థలపై ప్రభుత్వాల పెత్తనం లేకుండా ఎలా చేయాలి. వాటిపై ప్రజల్లో కోల్పోయిన నమ్మకం ఎలా పాదుగొల్పాలి**

కీలక సంస్థల అజమాయిషీని ప్రభుత్వం నుంచి తప్పించి స్వతంత్ర వ్యవస్థలకు ఇవ్వాలి. అప్పుడే తాము తప్పుచేసినా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాయన్న భయం ఏలికలకు ఉంటుంది. విదేశాల్లో ఆ పరిస్థితి ఉంది.


**(?) ప్రభుత్వం అంటేనే రాజకీయ పార్టీ జోక్యంతో ముడిపడి ఉంటుంది. అధికారం పదిల పరచుకోవడానికి పలువురు అడ్డదారులు తొక్కుతుంటారు. అధికారులను ప్రాసిక్యూట్ చేయాలంటే ప్రభుత్వ అనుమతి కావాలి. అనుమతి వచ్చి విచారణ మొదలుపెట్టినా అకస్మాత్తుగా ఉపసంహరణ ఉత్తర్వులు వచ్చి పడుతుంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం నివారించడం ఎలా సాధ్యం**

ప్రాసిక్యూట్ చేయడానికి ప్రభుత్వ అనుమతి అనేది సదుద్దేశంతో పెట్టింది. నిరాధారమైన ఆరోపణలు చేసినప్పుడు అధికారులను కాపాడేందుకు ఉపయోగపడుతుంది. కానీ దానికంటే తీవ్రమైన, దారుణమైన పరిణామం ఇంకోటి చోటు చేసుకుంది. అసలు ఏ ప్రభుత్వ అధికారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టాలన్నా కూడా ప్రభుత్వ అనుమతి తీసుకునేలా పార్లమెంటులో ఇటీవల చట్టం చేశారు. సీబీఐలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాల పట్ల గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలు దీన్ని సమర్థించడం గమనార్హం.

**(?) వ్యవస్థను లొంగదీసుకుని లబ్ధి పొందాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఇదే సమయంలో పాలకులకు లొంగి ఉండాలనే భావన దర్యాప్తు సంస్థల్లో ప్రబలిపోతోంది. ఇందుకు కారణాలేమిటి**

ఇప్పుడున్న పోలీసు చట్టం బ్రిటిష్ వారు 1861లో తీసుకొచ్చారు. వలస పాలనను కాపాడటం, ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ఆస్తుల్ని రక్షించడమే పోలీసుల కర్తవ్యంగా దాన్ని తీర్చిదిద్దారు. బ్రిటిష్ పాలన పోయినా దర్యాప్తు సంస్థల్లో ఇప్పటికీ అదే భావన కొనసాగుతోంది. ప్రభుత్వాలు కూడా పోలీసు వ్యవస్థ తమ చేతిలోనే ఉండాలనే ధోరణితో ఉంటున్నాయి. వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేయగలిగే వాతావరణం ఉంటేనే మార్పు సాధ్యమవుతుంది. ■





# ఎఫ్‌డీఆర్‌తో ఆలోచనల్ని పంచుకున్న జేడీ లక్ష్మీనారాయణ

సీబీఐ మాజీ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ ఇటీవల ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీని హైదరాబాద్‌లోని ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో కలిశారు. వ్యవసాయం, ఆరోగ్యం, ప్రభుత్వ విధానాల అమలుపై వీరుచర్చించారు. ఎఫ్‌డీఆర్ బృందం కూడా సమావేశంలో పాల్గొంది.

Posting Date 07-11-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on November 1st, 2018







మహాత్మాగాంధీ
150 జయంతి వేడుకల
ప్రారంభ ఏడాది
సందర్భంగా
హైదరాబాద్‌లోని
కార్యాలయంలో
నివాళులర్పిస్తున్న
లోక్‌సత్తా పార్టీ నేతలు

**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

**Lok Satta Times**
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad